RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



## పాంపీలో పురాతన 'మెషిన్ గన్'..
## వెలుగులోకి 2000 ఏళ్ల నాటి యుద్ధ రహస్యం!

ఢిల్లీ: పాంపీ నగరం అనగానే క్రీ.శ. 79లో వెసువియస్ అగ్నిపర్వతం బద్దలై బూడిద కింద సమాధి కావడం గుర్తుకొస్తుంది. కానీ, ఆ వినాశనానికి సుమారు 170 సంవత్సరాల ముందే అక్కడ జరిగిన ఓ భీకర యుద్ధానికి సంబంధించిన కీలక ఆధారాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. పురాతన కాలం నాటి 'మెషిన్ గన్'గా పిలిచే 'పాలిబోలోస్' అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అక్కడ వాడినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇటలీకి చెందిన కాంపానియా, బోలోగ్నా యూనివర్సిటీల పరిశోధకులు అధునాతన లేజర్ స్కానింగ్ , 3డి డిజిటల్ ఇమేజింగ్ టెక్నాలజీ సహాయంతో ఈ ఆవిష్కరణ చేశారు. పాంపీ ఉత్తర ప్రాంతంలోని కోట గోడలపై బాణాల దాడికి సంబంధించిన ప్రత్యేకమైన గుర్తులను గుర్తించారు. సాధారణ కాటపల్ట్ దాడుల్లా కాకుండా, ఈ గుర్తులు చిన్నవిగా, గుంపులుగా ఉన్నాయి. ఒకే చోటు నుంచి వేగంగా బాణాలను ప్రయోగించడం వల్లే ఇలాంటి గుర్తులు ఏర్పడతాయని పరిశోధకులు విశ్లేషిస్తున్నారు. ఈ దాడి క్రీ.పూ. 89లో రోమన్ జనరల్ లూసియస్ కార్నెలియస్ సూలా పాంపీని ముట్టడించినప్పుడు జరిగిందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. తన తూర్పు మధ్యధరా సైనిక చర్యల సమయంలో సూలా ఈ అధునాతన ఆయుధాన్ని, దాని టెక్నాలజీని పొంది ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పాలిబోలోస్ అనేది ఒకేసారి అనేక బాణాలను వేగంగా సంధించగల రిపీటింగ్ కాటపల్ట్. గ్రావిటీ ఫీడ్ మ్యాగజైన్ సహాయంతో బాణాలను ఆటోమేటిక్‌గా లోడ్ చేసుకుని నిరంతరాయంగా దాడి చేయగల సామర్థ్యం దీనికి ఉంది. ఈ ఆయుధానికి సంబంధించిన భౌతిక అవశేషాలు ఏవీ లభించనప్పటికీ, గోడలపై ఉన్న ఈ బాలిస్టిక్ గుర్తులే దాని వాడకానికి బలమైన సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు కేవలం గ్రంథాల్లో మాత్రమే ప్రస్తావన ఉన్న పాలిబోలోస్ ఆయుధం వాస్తవంగానే ఉనికిలో ఉండేదని ఈ పరిశోధన నిరూపించింది. ఈ వివరాలు ఎండీపీఐ (ఎండీపీఐ) జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

ఢిల్లీ: అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు తెలిపాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసాల జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదేశాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

## చిన్న గెలాక్సీలలోనూ బ్లాక్ హోల్స్..
## భారత శాస్త్రవేత్తల పరిశోధనలో కొత్త కోణం

ఈ పరిశోధన భవిష్యత్ టెలిస్కోపుల ద్వారా చేసే అధ్యయనాలకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుందని వ్యాఖ్య

ఢిల్లీ: విశ్వంలో అతిపెద్ద గెలాక్సీల కేంద్రాల్లోనే కాకుండా అతి చిన్న గెలాక్సీలలోనూ కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఉండే అవకాశం ఉందని భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడించింది. మన పాలపుంత గెలాక్సీ చుట్టూ పరిభ్రమించే మరుగుజ్జు గోళాకార గెలాక్సీలలో మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు బలమైన ఆధారాలు ఉన్నాయని తమ డేటా సూచిస్తోందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వివరాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన కె. ఆదిత్య, అరుణ్ మంగళం ఈ కీలక అధ్యయనం చేపట్టారు. వీరు నక్షత్రాలు, డార్క్ మ్యాటర్ హేలో, కేంద్రంలోని కృష్ణబిలం అనే మూడు గురుత్వాకర్షణ భాగాలతో కూడిన డైనమిక్ మోడళ్లను రూపొందించారు. అత్యంత నాణ్యమైన స్టెల్లార్ కైనమాటిక్ డేటాను ఉపయోగించి, ఈ గెలాక్సీలలో నక్షత్రాలు ఎలా కదులుతున్నాయో విశ్లేషించారు. ఒకవేళ ఆ గెలాక్సీల కేంద్రంలో కృష్ణబిలం ఉంటే, దాని ద్రవ్యరాశిని అంచనా వేయడానికి ఈ సమాచారాన్ని ఉపయోగించారు. ఈ పరిశోధనపై అరుణ్ మంగళం మాట్లాడుతూ.. "మా మోడళ్లు, డేటాను పరిశీలించినప్పుడు ఈ మరుగుజ్జు గెలాక్సీలలోని కేంద్ర కృష్ణబిలాల ద్రవ్యరాశిపై కచ్చితమైన పరిమితులు విధించగలిగాం. సాధారణంగా వీటి ద్రవ్యరాశి పది లక్షల సౌర ద్రవ్యరాశుల కంటే తక్కువగా ఉంటుంది. కొన్ని గెలాక్సీలలో ఇంకా తక్కువ విలువలు ఉండే అవకాశం ఉంది. ఈ గెలాక్సీలలో కచ్చితంగా భారీ కృష్ణబిలాలు ఉండాలని మా డేటా చెప్పడం లేదు. కానీ, మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు మాత్రం మా డేటా పూర్తిగా అనుకూలంగా ఉంది" అని వివరించారు. పెద్ద గెలాక్సీల కేంద్రాలలో సూపర్‌మాసివ్ కృష్ణబిలాలను గుర్తించడం సాధారణమే. కానీ, పాలపుంత చుట్టూ ఉండే మరుగుజ్జు గెలాక్సీలు చాలా కాంతిహీనంగా, వాయువులు లేకుండా, డార్క్ మ్యాటర్‌తో నిండి ఉంటాయి. దీంతో వీటిలో కృష్ణబిలాలను నేరుగా గుర్తించడం అత్యంత కష్టతరం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం గెలాక్సీలు, కృష్ణబిలాల పరిణామ సిద్ధాంతాలకు, భవిష్యత్ పరిశీలనలకు చాలా ముఖ్యమైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భవిష్యత్తులో ఐఐఏ ప్రతిపాదించిన నేషనల్ లార్జ్ ఆప్టికల్ టెలిస్కోప్ , ఎక్స్‌ట్రీమ్లీ లార్జ్ టెలిస్కోప్ వంటి అత్యాధునిక పరిశీలనా సౌకర్యాలు రాబోతున్నాయి. ఇవి అతి తక్కువ కాంతివంతమైన, చిన్న గెలాక్సీలలోని నక్షత్ర కదలికలను కూడా కచ్చితంగా కొలవగలవు. అలాంటి పరిస్థితుల్లో ఈ అధ్యయనంలో ప్రతిపాదించిన ఏకీకృత సంబంధం ఆ డేటాను విశ్లేషించడానికి ఒక బలమైన ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగపడుతుందని అరుణ్ మంగళం తెలిపారు.

## నాదెండ్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఉప ముఖ్యమంత్రి

అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయవేత్త నాదెండ్ల భాస్కరరావు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో నాదెండ్ల భాస్కరరావు కుమారుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పవన్ కల్యాణ్ ఫోన్ చేసి పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆయనకు, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, తనకు ఇటీవల శస్త్రచికిత్స జరగడం వల్ల తాను కోలుకుంటున్నానని, బయటకు రాలేని పరిస్థితుల్లో ఉన్నానని మనోహర్‌కు వివరించారు. ఈ కారణంగా నాదెండ్ల భాస్కరరావు గారి అంత్యక్రియలకు హాజరు కాలేకపోతున్నందుకు తన విచారాన్ని వ్యక్తం చేశారు. భాస్కరరావు గారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ నేతను కోల్పోవడం బాధాకరమని అన్నారు. తండ్రిని కోల్పోయిన పుత్రశోకంలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పవన్ కల్యాణ్ ఓదార్చారు. ఈ తీవ్ర విషాదం నుంచి ఆయన, వారి కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కష్ట సమయంలో దేవుడు వారికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీలో కీలక నేతలుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన సహచర నేత కుటుంబంలో జరిగిన ఈ విషాదం పట్ల పవన్ కల్యాణ్ స్పందించిన తీరు ప్రాధాన్యత సంతరించుకుంది.

## అమరావతి రాజధానిగా
# కొత్త మ్యాప్ విడుదల

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శాశ్వత హోదా కల్పిస్తూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా కొత్త మ్యాప్‌ను విడుదల చేశాయి. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక రాష్ట్ర రాజధానిని ఖరారు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం తెలపడంతో, అమరావతికి తిరుగులేని అధికారిక హోదా దక్కింది. 2024 జూన్ 2 నుండి ఇది అమల్లోకి వచ్చేలా చట్టం చేయడం గమనార్హం. దీంతో గత కొన్నేళ్లుగా సాగుతున్న 'మూడు రాజధానుల' గందరగోళానికి శాశ్వతంగా తెరపడింది. ఏపీ అడ్మినిస్ట్రేటివ్ మ్యాప్‌లో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. ఈ నూతన జిల్లాల సరిహద్దులతో కూడిన అధికారిక పటాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తన రికార్డుల్లో, భారత అధికారిక మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని అప్‌డేట్ చేసింది. ఇది దేశవ్యాప్త పరిపాలన అవసరాలకు ప్రామాణికంగా నిలవనుంది.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు..
## కేంద్రం కీలక ప్రకటన

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది. ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

## పెట్టుబడి ఒప్పందాలు వేగంగా అమల్లోకి

మొదటి పేజి తరువాయి

మూడు కేటగిరీలుగా ఒప్పంద సంస్థలు:

పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలి. మల్టీనేషనల్, మార్కెట్‌లో పేరు ప్రతిష్ఠలున్న కంపెనీలకు మొదటి ప్రాధాన్యమిచ్చి.. ఆయా సంస్థలు త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలి. వేగంగా ఎదుగుతున్న కంపెనీలు, భవిష్యత్‌లోనూ మంచి ప్రతిభ కనబర్చుతాయనుకునే సంస్థలకు తర్వాత ప్రాధాన్యమివ్వాలి. మిగతా కంపెనీలను మూడో ప్రాధాన్యంగా ఎంచుకొని వాటి పెట్టుబడులు పట్టాలెక్కేలా ప్రేరణ కల్పించాలి. ఫ్యూచర్ సిటీలో కార్యాలయం పనులు త్వరగా పూర్తి చేసి.. అక్కడే ఎంవోయూల అమలు, పురోగతిపై నిరంతరం పర్యవేక్షించాలి. ప్రతి అంశం సీఎంవో, ఆయా శాఖల మంత్రులు తెలుసుకునేలా డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలి. టైర్ 2, టైర్ 3 సిటీల్లో ఏర్పాటు చేసిన ఐటీ టవర్లలో కొనసాగుతున్న కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి సద్వినియోగం చేసుకోవాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జైకా నిధులతో చేపట్టనున్న పనులపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్‌మిశ్రా, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మెట్రో పనులకు వేగంగా భూసేకరణ

హైదరాబాద్ ఓల్డ్ సిటీలో మెట్రో పనులకు సంబంధించి మిగిలిన కొంత భూ సేకరణను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైలు పనులపై సీఎం సమీక్షిస్తూ రెండేళ్లలోనే చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు పనులు పూర్తి కావాలన్నారు. రెండో దశ మెట్రో అనుమతులు, బహదూర్‌గూడ వద్ద హైస్పీడ్ కారిడార్ వద్దకు మెట్రో విస్తరణ అంశాలపైనా చర్చించారు.

## అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతాం

మొదటి పేజి తరువాయి

మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ సోలార్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 6.5 గిగావాట్ల ఇన్‌గాట్-వేఫర్ తయారీ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధిపై తన ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

పెట్టుబడులతో పునర్నిర్మాణం

గత ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు రెన్యూ ఎనర్జీ సంస్థ భారీ పెట్టుబడితో ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, రాంబిల్లిలో సోలార్ ఫలకాల తయారీ పరిశ్రమ రావడం ద్వారా రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

గ్రీన్ ఎనర్జీయే లక్ష్యం

రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ రంగంలో రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఒప్పందాలు (ఎంఓయూలు) సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ సంస్థే రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందన్నారు. అభివృద్ధికి విద్యుత్ వినియోగం ఒక సూచిక అని, అందుకే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. దీనిలో భాగంగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్టీసీ కూడా 1,050 గ్రీన్ బస్సులను ప్రవేశపెడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

### గత ప్రభుత్వంపై విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని చంద్రబాబు ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) రద్దు చేయడం, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వంటి చర్యలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తమ ప్రభుత్వం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణల ఫలాలను ప్రజలకు అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## తిరుమలలో భక్తుల రద్దీ..
## ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.43 కోట్లు

తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగా కొనసాగుతోంది. నిన్న మొత్తం 65,354 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం నాడు 25,550 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇక శ్రీవారి హుండీ ద్వారా ఒక్కరోజే రూ.4.43 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 5 కంపార్ట్‌మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వివరించారు.

## నైతిక విలువలు, మానవీయ కోణం మర్చిపోవద్దు

హైదరాబాద్: 'మీరు సంతకం చేసే ప్రతి ఫైలు వెనుక ఒక సామాన్యుడి ఆశ ఉంటుంది. ఆ ఫైలును కేవలం కాగితంలా చూడకండి.. అది ఒకరి జీవితాన్ని మార్చే శక్తి అని గుర్తుంచుకోండి..'అంటూ కొత్తగా ఎంపికైన గ్రూప్1 అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హితవు పలికారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 6 వారాల పాటు 214 మంది అధికారుల కు నిర్వహించిన శిక్షణా తరగతుల ముగింపు కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సేవలో పా టించాల్సిన నైతిక విలువలు, పరిపాలనలో మానవీయ కోణాన్ని మర్చిపోవద్దని దిశానిర్దేశం చేశారు. 'వ్యవస్థలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి కానీ అందులో పనిచేసే వ్యక్తులు చూపే సానుభూతి మాత్రమే మార్పును తెస్తుంది. రైతు ఆశ, విద్యార్థి కల, రోగి ప్రాణం.. ఇవన్నీ మీరు తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయి. చట్టాలకు లోబడి ఉంటూనే, మానవీయ కోణంలో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి..'అని చెప్పారు.

### ఒత్తిళ్లకు లొంగొద్దు.. :

ఫైళ్లు, సమీక్షల హడావుడిలో పడి సామాన్యుడిని విస్మరించవద్దని, రైతు సాయం, విద్యార్థి స్కాలర్‌షిప్, రోగి ఆరోగ్యం మీ కలంపైనే ఆధారపడి ఉంటాయనే విషయం గుర్తుంచుకోవాలని భట్టి అన్నారు. అధికారులు ఒత్తిళ్లకు లొంగకుండా నైతిక విలువలతో పనిచేసినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న సమ్మిళిత వృద్ధిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే అని అన్నారు. ప్రభుత్వ ప్రతిష్ట మీ నడవడిక పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు.

## అవి నరకాలు కావు...
## మానవాళికి మహోన్నత దేశాలు...

మొదటి పేజి తరువాయి

అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్ నాగరికత కు పుట్టినిల్లు అంటూ హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ పోస్టు పెట్టింది. "ఆసియా దేశాల నుంచి మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి బిడ్డకు జన్మనిస్తారు. ఇక్కడ ఉన్న చట్టాలేమో ఆ బిడ్డకు వెంటనే అమెరికా సిటిజన్‌షిప్ ఇస్తాయి. ఆ తర్వాత వారు తమ కుటుంబసభ్యులందరినీ చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారు" అంటూ జన్మతః పౌరసత్వం పై మైఖెల్ షేర్ చేసిన ఒక లేఖను ట్రంప్ రీపోస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ఇరాన్ కౌంటర్ ఇస్తూ.. "భారత్, చైనాలు మహోన్నత నాగరికతలకు పుట్టినిళ్లు. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తామని ఒక యుద్ధ నేరస్థుడైన అధ్యక్షుడు చెప్పడమే అసలైన నరకం" అని విమర్శించింది. ఇరాన్ నాగరికత మొత్తం అంతమైపోతుందని గతంలో ట్రంప్ హెచ్చరికలు చేసిన తెలిసిందే. ఆ బెదిరింపులను ఉద్దేశించే తాజా స్పందన వచ్చింది. భారత, చైనా నాగరికతలు ప్రపంచంలోనే పురాతన, సజీవ నాగరికతలు. 4వేల ఏళ్లనాటి చరిత్ర, సంస్కృతి ఈ దేశాల సొంతం. ఈజిప్టు, మెసొపొటేమియా వంటి నాగరికతలు అంతమైనా భారత్, చైనా నాగరికతలు సింధు, హొయాంగ్ హో నది (యల్లో రివర్) ఒడ్డున విస్తరించాయి. ఈ రెండూ వేర్వేరు భౌగోళిక పరిస్థితుల్లో విలసిల్లినా.. ఆసియా చరిత్రపై బలమైన ప్రభావాన్ని చూపించాయి. ఇప్పుడు ఈ రెండు దేశాలు బలమైన ఆర్థిక శక్తులుగా ఎదుగుతున్నాయి. అలాగే ఇరాన్ నాగరికత (పర్షియా) కూడా పురాతనమైనదే. అదే అమెరికా (ఖురూూ) విషయానికొస్తే.. 1776లో ఏర్పడింది. అంటే దాని చరిత్ర పట్టుమని 250 ఏళ్లే.

## ఆ జలసంధిలో.. ఒక్కచోటే
# 124 నౌకల శకలాలు

మొదటి పేజి తరువాయి

124 నౌకల శకలాలను పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిల్లో అత్యంత పురాతన ఓడల నుంచి ఆధునిక నౌకల శకలాలు వరకు ఉన్నాయని శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో వెల్లడించారు. స్పెయిన్‌కు చెందిన కొందరు పురావస్తు శాస్త్రవేత్తలు 2020-2023 మధ్య సర్వే చేశారు. నీటి అడుగున ఉన్న పురావస్తు ప్రాంతాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే జిబ్రాల్టర్ జలసంధిలోని 29 స్క్వేర్‌మైల్ బే వద్ద 124 నౌకల శకలాలను గుర్తించారు. ఇందులో అతిపురాతన ఫ్యూనిక్ నాగరికత, రోమన్, మధ్యయుగం నాటి నౌకల శకలాలు కూడా ఉన్నట్లు శాస్త్రవేత్తలు తమ రీసెర్చ్ పేపర్‌లో పేర్కొన్నారు. ఇందులో ఒకటి 5వ శతాబ్దం నాటి నౌక అని గుర్తించారు. అప్పట్లో ఆ నౌకలో స్పెయిన్‌లో ఉత్పత్తి చేసిన చేపల సాస్‌ను రవాణా చేసి ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో ఇటలీ నౌక ఉపయోగించిన ఓ సబ్‌మెరైన్ శకలాన్ని కూడా ఈ ప్రాంతంలోనే గుర్తించారు. ఈ బృందం నీటి లోపల కేవలం 10 మీటర్ల లోతు వరకే అధ్యయనం చేసిందట. ఈ ప్రాంతం మొత్తం లోతు దాదాపు 400 మీటర్లు ఉంటుందని, ఇంకా లోపలికి వెళ్తే మరిన్ని ఆసక్తికర విషయాలు బయటపడొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఏంటీ జలసంధి.. హర్మూజ్ మాదిరిగానే 'జిబ్రాల్టర్' కూడా సన్నని పొడవైన జలసంధి. దాదాపు 36 మైళ్ల పొడవుండే ఈ జలమార్గం అట్లాంటిక్ మహా సముద్రం, మధ్యధరా సముద్రాన్ని కలుపుతుంది. ఈ జలసంధి ఓ ప్రాంతం వద్ద కేవలం 8 మైళ్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. అంతర్జాతీయ సరకు రవాణాలో ఇది కూడా ఓ ప్రధాన జలమార్గం. రోజుకు సగటున 300 నౌకలు జిబ్రాల్టర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి.

## హైకోర్టు తీర్పు సర్కారుకు చెంపపెట్టు

హైదరాబాద్: ప్రాథమిక హక్కులను, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక చెల్లదని, దాని ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని భారాస నేత, అసెంబ్లీలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ టి.హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరంలోని 100 కాంపొనెంట్లలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే.. రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయంటూ కాంగ్రెస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా కక్షసాధింపులు మానుకొని.. మేడిగడ్డలోని ఆ రెండు పిల్లర్లకు వెంటనే మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్‌రావు తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. "గత భారాస ప్రభుత్వంపై బురద జల్లి.. రాజకీయ లబ్ధి పొందాలన్న దురుద్దేశంతోనే ఎన్నికల ముందు.. ఎన్నికల తర్వాత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ రకరకాల లీకులు ఇస్తూ.. అక్రమ కేసులు బనాయిస్తూ వచ్చింది. హైకోర్టు తీర్పుతో ఆ ప్రచారం అసత్యమని తేలిపోయింది. కాళేశ్వరమే ఈ రాష్ట్రానికి ప్రాణాధారం. హైదరాబాద్ సహా 70% తెలంగాణకు తాగునీరు.. 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అద్భుత ప్రాజెక్టు ఇది. రాజకీయాలు చేయడానికి అనేక వేదికలున్నాయి. కానీ రాష్ట్ర భవిష్యత్, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేయకూడదు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ వైఫల్యాలను, స్కాములను బయటపెడుతున్నాం. సమాధానం చెప్పుకోలేక మమ్మల్ని సస్పెండ్ చేయడమే కాకుండా.. నేను అవినీతిని బయటపెట్టిన 48 గంటల్లోనే నా మీద రెండు ఎంక్వైరీలు వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం మా పోరాటం ఆగదు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాటలకు ఎలాంటి విలువా లేదు. ముందుగా ఆయన గోదావరి-బనకచర్ల లింక్ ద్వారా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలి. ఆంధ్రాకు ప్యాకేజీలు, ప్రాజెక్టులు వస్తుంటే.. తెలంగాణకు ఏమొస్తుందో సంజయ్ సమాధానం చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## భారత్‌లో ప్రాణాంతకంగా మారుతున్న వేసవి.. మెదడుకు ముప్పు!

ఢిల్లీ: భారత్‌లో వేసవి కాలం అంటే కేవలం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మాత్రమే కాదు. వాతావరణంలో అధికమవుతున్న తేమ (హ్యుమిడిటీ), వేసవి తాపాన్ని మరింత ప్రాణాంతకంగా మారుస్తోంది. శరీరం తనను తాను చల్లబరుచుకునే సహజ ప్రక్రియకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. ఈ ప్రమాదకర పరిస్థితిని అర్థం చేసుకోవడానికి 'వెట్-బల్బ్ ఉష్ణోగ్రత' (ఔవ్-ఎబశ్రీవ్ వఎజూవతీఖ్బతీవ) అనే కీలకమైన అంశంపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం పొడి వేడి మాత్రమే కాకుండా, అధిక తేమతో కూడిన వేడి కూడా అంతే ప్రమాదకరమని 'నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురించిన 2026 నాటి తాజా పరిశోధనలు సహా అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఏమిటీ వెట్-బల్బ్ ఉష్ణోగ్రత?... వెట్-బల్బ్ ఉష్ణోగ్రత అంటే గాలిలోని వేడి, తేమ రెండింటినీ కలిపి కొలిచే ఒక పద్ధతి. చెమట పట్టడం ద్వారా మానవ శరీరం ఎంత సమర్థవంతంగా చల్లబడుతుందో ఇది సూచిస్తుంది. సాధారణ గాలి ఉష్ణోగ్రతలా కాకుండా, గాలిలోని తేమ ఆవిరి అవ్వడం ద్వారా చేరగల అత్యల్ప ఉష్ణోగ్రతను ఇది తెలియజేస్తుంది. "వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, చెమట పట్టే ప్రక్రియ సరిగా పనిచేయదు. దీనివల్ల శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడం చాలా కష్టమవుతుంది" అని మాక్స్ హాస్పిటల్ (వైశాలి)కు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ గౌరవ్ బాత్రా వివరించారు. శరీరాన్ని చల్లబరిచే ప్రధాన ప్రక్రియ చెమట పట్టడమే కాబట్టి, ఈ పరిస్థితి చాలా ప్రమాదకరం. 'జర్నల్ ఆఫ్ అప్లైడ్ ఫిజియాలజీ' అధ్యయనం ప్రకారం వెట్-బల్బ్ ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటితే అది అత్యంత ప్రమాదకరమైన పరిమితి. ఆ స్థాయిలో ఆరోగ్యవంతులు సైతం నీడలో, తగినంత నీరు తాగుతున్నా ఎక్కువ సేపు తట్టుకోవడం కష్టమని పరిశోధనలు చెబుతున్నాయి.

మెదడుపై తీవ్ర ప్రభావం.. తీవ్రమైన వేడి మెదడుపై తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని 'క్రిటికల్ కేర్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం హెచ్చరించింది. ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులకు మెదడు చాలా సున్నితంగా స్పందిస్తుంది. ఎక్కువ సేపు అధిక వేడికి గురవడం వల్ల మెదడు సాధారణ పనితీరు దెబ్బతింటుంది. "అధిక వేడి కారణంగా బ్లడ్-బ్రెయిన్ బారియర్ దెబ్బతినడం, మెదడు కణాల పనితీరులో లోపాలు, సెరిబ్రల్ ఎడెమా (మెదడులో నీరు చేరడం) వంటివి సంభవించవచ్చు" అని డాక్టర్ బాత్రా హెచ్చరించారు. గందరగోళం, తలనొప్పి, అయోమయం వంటివి మెదడుపై వేడి ప్రభావం చూపుతోందనడానికి తొలి సంకేతాలు. తీవ్రమైన సందర్భాల్లో మూర్ఛ రావడం లేదా కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంది.

కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారికి అధిక వెట్-బల్బ్ ఉష్ణోగ్రతలు మరింత ప్రమాదకరం. ముఖ్యంగా గతంలో తలకు గాయాలైన వారు, బ్రెయిన్ సర్జరీ జరిగిన వారు, ఇంట్రాక్రానియల్ బ్లీడింగ్ సమస్యలు ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. "ఇలాంటి వారిలో శరీర ఉష్ణోగ్రత కొద్దిగా పెరిగినా కపాలంలో ఒత్తిడి పెరిగి, మెదడుకు సెకండరీ గాయం అయ్యే ప్రమాదం ఎక్కువ" అని డాక్టర్ బాత్రా వివరించారు. అధిక వేడి వల్ల రక్తపోటులో మార్పులు, డీహైడ్రేషన్‌కు సంబంధించిన రక్తం గడ్డకట్టే సమస్యలు పెరిగి, బ్రెయిన్ స్ట్రోక్ వంటివి సంభవించే అవకాశం ఉంది. అధిక తేమ ఉన్నప్పుడు డీహైడ్రేషన్ వేగంగా జరుగుతుంది. దీనివల్ల శరీరంలో రక్తం పరిమాణం తగ్గి, మెదడుతో సహా కీలక అవయవాలకు రక్త ప్రసరణ మందగిస్తుంది. ఈ కారణంగా ఆరోగ్యవంతుల్లో సైతం తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చు. అందుకే వాతావరణంలో మార్పుల నేపథ్యంలో కేవలం ఉష్ణోగ్రతను మాత్రమే కాకుండా వెట్-బల్బ్ ఉష్ణోగ్రతపై కూడా అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం. తల తిరగడం, గందరగోళం, అధిక అలసట వంటి ప్రారంభ లక్షణాలను గుర్తించి, వెంటనే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా తీవ్ర ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## తమిళనాట కొత్త శకం..
## 50 ఏళ్ల రాజకీయాలకు విజయ్ పార్టీతో సవాల్

తమిళనాడు: తమిళనాడు రాజకీయ చరిత్రలో 2026 అసెంబ్లీ ఎన్నికలు ఒక కీలక ఘట్టంగా నిలవనున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ద్విముఖ పోరు స్థానంలో ఇప్పుడు త్రిముఖ సమరం ఆవిష్కృతమవుతోంది. ప్రముఖ నటుడు విజయ్ తన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో రాజకీయాల్లోకి ప్రవేశించడమే ఈ మార్పునకు ప్రధాన కారణం. గత 50 ఏళ్లుగా తమిళనాడు రాజకీయాలు ద్రవిడ సిద్ధాంతాల చుట్టూ, డీఎంకే, అన్నాడీఎంకే అనే రెండు ప్రధాన పార్టీల మధ్యనే తిరిగాయి. ఈ రెండు పార్టీలు ఒకదాని తర్వాత మరొకటి అధికారాన్ని పంచుకుంటూ వచ్చాయి. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే 2021 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయాలతో తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. మరోవైపు, జయలలిత మరణం తర్వాత బలహీనపడినా, ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వంలో అన్నాడీఎంకే ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తోంది. అయితే, విజయ్ రాకతో ఈ రెండు పార్టీల సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.

తమిళ సినీ రంగంలో అగ్రశ్రేణి నటుడిగా ఉన్న విజయ్ తనకున్న ప్రజాదరణను రాజకీయ వేదికగా మార్చుకున్నారు. అవినీతి నిర్మూలన, సుపరిపాలన, సామాజిక న్యాయం వంటి అంశాలతో యువతను, తొలిసారి ఓటు వేయనున్న వారిని టీవీకే ఆకర్షిస్తోంది. బూత్ స్థాయి కమిటీల ఏర్పాటుతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుంటోంది. రాష్ట్రంలో దాదాపు 2.5 కోట్ల మంది 40 ఏళ్ల లోపు ఓటర్లు ఉండటంతో, విజయ్ పార్టీ 15 శాతం నుంచి 20 శాతం వరకు ఓట్లను సాధించగలదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కూడా విజయ్ ప్రత్యేక హామీలు గుప్పిస్తున్నారు. 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, సంవత్సరానికి ఆరు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు, వివాహాలకు బంగారం, పట్టుచీరలు వంటి హామీలను ప్రకటించారు.

టీవీకే రాకతో ఎన్నికల డైనమిక్స్ పూర్తిగా మారిపోయాయి. డీఎంకే వైపు మొగ్గు చూపే యువత, పట్టణ ఓటర్లను, అలాగే అన్నాడీఎంకేకు మద్దతిచ్చే ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను ఈ పార్టీ చీల్చుతోంది. దీనివల్ల అనేక నియోజకవర్గాల్లో ఫలితాలు అనూహ్యంగా మారనున్నాయి. టీవీకే నేరుగా గెలవకపోయినా, ఓట్లను చీల్చడం ద్వారా 'కింగ్ మేకర్' పాత్ర పోషించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చెన్నై, కన్యాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి వంటి ప్రాంతాల్లో టీవీకే ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో డీఎంకే, అన్నాడీఎంకే తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. డీఎంకే తన సంక్షేమ పథకాలు, సుపరిపాలనను నమ్ముకోగా, అన్నాడీఎంకే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని ప్రయత్నిస్తోంది. అయితే, చాలామంది ఓటర్లు ఇప్పటికీ దీనిని డీఎంకే, అన్నాడీఎంకే మధ్య పోరుగానే చూస్తున్నారని కొన్ని సర్వేలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం త్రిముఖ పోరు స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం మీద, 2026 ఎన్నికల్లో టీవీకే గెలుపు గుర్రం ఎక్కకపోయినా, ఏ పార్టీ అధికారంలోకి రావాలో నిర్ణయించే శక్తిగా మారనుందనడంలో సందేహం లేదు.

# టిఎంసికి షాక్ ఇచ్చిన ఝుల్మురి



కృష్ణానగర్ : పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ నేడు కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి -- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝుల్ (మసాలా) టిఎంసిని తాకింది- అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. టిఎంసి మాత్రం ఘుస్పైతియోం కా సాత్, ఘుస్పైతియోం కా వికాస్'ని నమ్ముతుంది అని మోడీ అన్నారు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుంది. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

## వాట్సప్ యూనివర్శిటీ' సమాచారాన్ని స్వీకరించలేం



న్యూఢిల్లీ : ప్రముఖ రచయితలు, మేధావుల అభిప్రాయాలను గౌరవిస్తామని, వాట్సప్ యూనివర్శిటీ నుండి వచ్చే సమాచారాన్ని స్వీకరించలేమని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై, పలు మతాలు పాటించే మతస్వేచ్ఛ పరిధి, పరిమితులకు సంబంధించిన పిటిషన్లపై విచారణ చేపడుతున్న రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలే, జస్టిస్ ఆర్. మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన తొమ్మిది మంది జడ్జీలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ పిటిషన్ లను విచారిస్తోంది. దావూదీ బొహ్రా సమాజం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ విచారణ సందర్భంగా మతపరమైన ఉపశమన అంశాల్లో న్యాయపరమైన సంయమనం గురించి కాంగ్రెస్ నేత శశిథరూర్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. తాము ప్రముఖుల, న్యాయ నిపుణుల సూచనలను గౌరవిస్తామని, వ్యక్తిగత అభిప్రాయం వ్యక్తిగత అభిప్రాయమేనని అన్నారు. అన్ని వనరుల నుండి సూచనలను స్వీకరించడంలో ఎటువంటి ఇబ్బంది లేదని, న్యాయవాది కౌల్ అన్నారు. అయితే వాట్సప్ యూనివర్శిటీ నుండి స్వీకరించలేమని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు.

## క్లీన్ ఎనర్జీ ప్లాంట్ కు సిఎం చంద్రబాబు శంకుస్థాపన



రాంబిల్లి (అనకాపల్లి) : భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అదరగొడుతోందని, దేశంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారవుతుందని సిఎం చంద్రబాబు తెలిపారు. రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ కంపెనీకి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందన్నారు. అత్యంత వెనుకబడిన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలో ధనిక జిల్లాగా మారిందని, ఇప్పటికే విశాఖలో పూర్తిగా పరిశ్రమలు వచ్చాయని అన్నారు. ఇకపై ఏ పెట్టుబడులు వచ్చినా అనకాపల్లి జిల్లాకే వస్తాయన్నారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా చేసే బాధ్యత తనది అని చెప్పారు. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రాంబిల్లిలోని సోలార్ ఇన్‌ఘాట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుందన్నారు. ప్రధాని మోడి ఆత్మనిర్భర్ భారత్ కలల సాకారానికి ఇదే నిదర్శనం అని చెప్పారు. 2000లోనే విద్యుత్ రంగ సంస్కరణలు మొదలుపెట్టామన్నారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ రంగం కుప్పకూలిందని, ఉచిత సోలార్ కరెంటు వాడకుండా రూ.9వేల కోట్లు చెల్లించారని తెలిపారు. విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్లు భారం మోపారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం మోపారని ఆరోపించారు. కేంద్రం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుంటే.. ఎపి 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళుతోందన్నారు. గ్రీన్ ఎనర్జీ వల్ల రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయన్నారు. 22 నెలల వ్యవధిలో 117 ప్రాజెక్టులు క్లియర్ చేశామన్నారు. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, మొత్తం 4.76 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఇప్పటికే 160 గిగావాట్లలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీకి అనుమతులు మంజూరు చేశామన్నారు. గ్రీన్ ఎనర్జీలో ఎన్టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతోందని, వచ్చే ఏడాది ఈ పనులు కూడా ప్రారంభమవుతాయి అని తెలిపారు. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నామని ప్రకటించారు. వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరో 444 ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని, మూడేళ్లలో 5 వేలకుపైగా ఛార్జింగ్ స్టేషన్లు వస్తాయని, రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌వేనని చంద్రబాబు ప్రసంగించారు.

## తెలుగు రాష్ట్రాలకు రెయిన్ అలర్ట్ ..!

అమరావతి : తెలుగు రాష్ట్రాలకు ఐఎండి రెయిన్ అలర్ట్ ఇచ్చింది. ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావంతో మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని జిల్లాలకు హెచ్చరికలు జారీ అయ్యాయి. మహారాష్ట్ర నుంచి కర్నాటక, రాయలసీమ, తమిళనాడుపై ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. అంతేకాకుండా.... ఉత్తర తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణశాఖ తెలిపింది. ఈ ప్రభావంతో మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉంది. ఓవైపు ఎండలు మండుతుండగా... మరోవైపు తాజా వాతావరణ మార్పుల కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మూడు నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎపి లోని ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ, రేపు ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల వర్షాలు పడొచ్చు. కొన్నిచోట్ల 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ఇవాళ, రేపు దక్షిణ కోస్తాతో పాటు రాయలసీమలోనూ తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు పడొచ్చు. తెలంగాణలో కూడా వాతావరణం భిన్నంగా ఉంది. ఓవైపు ఎండలు ఉండగా... మరికొన్నిచోట్ల వర్షాలు పడుతున్నాయి.మరో మూడు నాలుగు రోజులు కూడా వర్షాలు పడే అవకాశం ఉంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం రిపోర్ట్ ప్రకారం.... ఇవాళ వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి,మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడొచ్చు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. ఏప్రిల్ 24 సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి. ఏప్రిల్ 25వ తేదీన సిద్ధిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఏప్రిల్ 26వ తేదీన వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో వర్షాలు పడొచ్చు. ఈ జిల్లాలకు హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇక ఏప్రిల్ 27వ తేదీ నుంచి తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుంది.

# మోడీ వ్యతిరేకులు ఓడారా లేక గెలిచారా?

చట్టసభల్లో 33% సీట్లు మహిళలకు రిజర్వు చేయడానికి ఉద్దేశించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం దేశంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ బిల్లును లోక్‌సభలో గట్టెక్కించుకోవడానికి ప్రధాని మోదీ శతవిధాల ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ బిల్లు ఆమోదం పొందడానికి సహకరించిన వారి పేర్లతో ధన్యవాదాల పోస్టర్లను ప్రభుత్వమే ముద్రిస్తుందని, ఈ బిల్లు క్రెడిట్ తామే తీసుకోవచ్చని లోక్‌సభ ప్రతిపక్ష సభ్యులకు ఒక ఆఫర్ కూడా ఆయన ఇచ్చారు. మోదీ మనుగడే గిట్టని ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ తమ పార్టీ లోక్‌సభ ఎంపీలకు సరైన మార్గ నిర్దేశం చేసి ఓటింగ్‌కు తీసుకొచ్చారు. ఈ బిల్లు వీగిపోవడానికి మోదీ వ్యతిరేక పక్షాలన్నీ కలిసికట్టుగా పనిచేశాయి. ఈ విషయంలో ప్రతిపక్షాల పట్టుదలను శ్లాఘించవలసిందే. తమ పట్టుదలతో ప్రజాస్వామ్యం బతికిందని, రాజ్యాంగం రక్షించబడిందని ప్రతిపక్షాల నాయకులు పెద్ద పెద్ద మాటలు మాట్లాడడం మొదలుపెట్టారు. వాస్తవంగా ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యాన్ని ఓడించాయి. ప్రతిపక్ష నాయకులు మోడీపై వ్యతిరేకతతో ఈ మహిళా రిజర్వేషన్ బిల్లుకు తిలోదకాలు ఇవ్వడం రాజ్యాంగ పరిరక్షణ అవుతుందా

### మహిళా బిల్లుకు 30 ఏళ్లు..

ఇక వాస్తవ విషయానికి వస్తే, ఈ రాజ్యాంగ సవరణకు తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ మోడీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా డీలిమిటేషన్ బిల్లుతో కలిపి లోక్సభలో ప్రవేశపెట్టడం ద్వారా మోదీ అమిత్ షాల రాజకీయ చతురత స్పష్టమైంది. ఈ బిల్లు సభ ఆమోదం పొందితే ఒక ప్రయోజనం. ఓడిపోతే మరొక ప్రయోజనం మోడీ ప్రభుత్వానికి ఒనగూడుతుందనేది కాదనలేని సత్యం. మహిళా రిజర్వేషన్ల చట్టానికి ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ వ్యతిరేకం అనే భావం చదువుకున్న మహిళలపై కొంత ప్రభావం చూపుతుందనడంలో అవాస్తవికత లేదు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో మహిళా ఓటర్ల ఆలోచన విధానంపై దీని ప్రభావం తప్పకుండా ఉంటుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రను ఒకసారి పరిశీలిస్తే- 1996లో నాటి ప్రధానమంత్రి దేవగౌడ నాయకత్వంలో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ చట్టం వల్ల అగ్రకుల మహిళలు మాత్రమే ప్రజాప్రతినిధులుగా ఎన్నికౌతారని, లల్లూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ ఈ బిల్లును అడ్డుకున్నారు. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో మూడుసార్లు ఈ బిల్లును ప్రవేశపెట్టాలని చూసినా కాంగ్రెస్ పార్టీ మోకాలు వడ్డడంతో వీలు కాలేదు. చివరికి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఈ బిల్లుపై రాజ్యసభ ఆమోదాన్ని తీసుకున్నా, లోక్‌సభ ఆమోదించలేదు.





### బీజేపీ, లెఫ్ట్ ఆలోచన ఒక్కటే.. కానీ..!

రాజకీయాలను పక్కనపెట్టి మాట్లాడితే.. మహిళల సాధికారత విషయంలో బిజెపి, వామపక్ష పార్టీల నాయకుల ఆలోచన ఒకే విధంగా ఉంది. కానీ రాజకీయపరంగా ఇవి రెండు శత్రుపక్షాలు. సుదీర్ఘకాలం ఈ దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ప్రయత్నించి ఉంటే, మహిళా రిజర్వేషన్ చట్టం ఎప్పుడో అమలులోకి వచ్చేది. షాబానో కేసు విషయంలో, ట్రిపుల్ తలాక్ చట్టం రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ ముస్లిం మహిళల ప్రయోజనాలకు ఎలా గండి కొట్టిందో తెలిసిందే.

### రాజ్యాంగంలోనే డీలిమిటేషన్ నిబంధనలు

ఇక డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల వాదనను కాంగ్రెస్ పార్టీ సమర్థించడం, ఆ పార్టీ నైతిక పతనానికి పరాకాష్టగా భావించాలి. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు స్థానాలు నిర్ణయించబడాలని రాజ్యాంగంలో నిబంధనలు పెట్టింది కాంగ్రెస్ పార్టీ గొడుగు కింద పనిచేసిన రాజ్యాంగ నిర్మాతలే అనే వాస్తవాన్ని మరువకూడదు. ఉత్తరాది రాష్ట్రాల వారికి పార్లమెంటు సీట్లు పెరిగితే, దక్షిణాది రాష్ట్రాలపై పెత్తనం ఉంటుందని కొంతమంది రాజకీయ నాయకులు చేసే వాదన పసలేనిది. ఢిల్లీకి 7 పార్లమెంటు సీట్లు, హైదరాబాదుకు మాత్రం రెండు పార్లమెంట్ సీట్లే. ఇవి రెండు మహానగరాలే. ఇందులో వ్యత్యాసం ఎందుకు ఇక ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమలో ఎమ్మెల్యే సీట్లు తక్కువ కోస్తాలో ఎమ్మెల్యే సీట్లు ఎక్కువ. ఈ విధమైన వ్యత్యాసాల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది అని ఎవరైనా వాదించగలరా జనాభాను తగ్గించుకున్నందుకు దక్షిణాది రాష్ట్రాలకు 'పనిష్మెంట్'అన్యాయం, ద్రోహం వంటి మాటలను దక్షిణాదిలో కొందరు నాయకులు ఉపయోగిస్తూ ఉత్తర, దక్షిణాది ప్రాంతీయ బేధాలను సృష్టించే ప్రయత్నం చేయడం క్షంతవ్యం కాదు.

### నేతలకు తప్ప మరే ప్రయోజనం లేదు

కుటుంబ నియంత్రణ విషయంలో ఆరోగ్య శాఖ హిందువుల దగ్గరికి వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌పై ఒత్తిడి తెస్తుంది. ఇస్లాం సమాజంపై ఆ ఒత్తిడి ఉండదు. కుటుంబ నియంత్రణను పాటించాను కాబట్టి రాజ్యాంగ విరుద్ధంగా సౌకర్యాలు కావాలని ఎవరైనా కోరుతారా దక్షిణాది రాష్ట్రాల నాయకుల వాదన ఈ కోవలోకి వస్తుంది. లోకసభ సీట్లు పెరిగితే అన్ని రాజకీయ పార్టీలు ప్రయోజనం పొందాలని చూస్తున్నాయి. వాస్తవంగా డీ లిమిటేషన్ ప్రక్రియ వల్ల రాజకీయ నాయకులకు తప్ప దేశ ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదు. కోటాను కోట్లు ప్రజల కష్టార్జితమైన పన్నుల నుండి పార్లమెంట్ సభ్యుల జీతభత్యాలు, వినోదాలకు ఖర్చు చేయవలసి ఉంటుంది. ప్రజల ఆలనా పాలన చూడటానికి స్థానిక సంస్థల ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఉండనే ఉన్నాయి. లోక్సభ సీట్ల పెంపుపై అనవసర రాద్ధాంతం, రచ్చ, చర్చ ఎందుకు ఈ కోణంలో ఈ దేశ హితాన్ని కోరే ప్రజలు ఆలోచిస్తే, రాజకీయ నాయకులకు కొంతైనా జ్ఞానోదయం అవుతుందేమో! దేనికైనా కాలం కలిసి రావాలి!

# గెలిచిన సమాఖ్య స్ఫూర్తి.. కొంపముంచిన అతివిశ్వాసం!

భారత పార్లమెంట్‌లో మొన్న చోటుచేసుకున్న 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించిన పరిణామాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచాయి. లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందడంలో ప్రభుత్వానికి ఎదురైన విఫలం సాధారణ సంఖ్యాబలం లోపం మాత్రమే కాకుండా, లోతైన వ్యూహాత్మక లోపాలను బహిర్గతం చేసింది. మహిళా రిజర్వేషన్ వంటి సున్నితమైన సామాజిక అంశాన్ని నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడం, ప్రాంతీయ సమతుల్యతపై ఆందోళనలు రేకెత్తించడం, ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడం వంటి పరిణామాలు ఈ ఓటింగ్‌కు విస్తృత రాజకీయ ప్రాధాన్యతను తీసుకువచ్చాయి. ఏదేమైనా ఈ ఘటన సమాఖ్య స్ఫూర్తి, రాజ్యాంగ పరిరక్షణ, రాజకీయ సమన్వయం ఎంత ముఖ్యమో మరోసారి గుర్తు చేసింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం ఎన్డీయే ప్రభుత్వ వ్యూహాత్మక తప్పిదం. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో ప్రభుత్వం విఫలమవ్వడం వెనుక అనేక రాజకీయ పొరపాట్లు ఉన్నాయి.. ఇదే ప్రతిపక్షాలకు ఒక ఆయుధాన్ని అందించింది.

### సమాఖ్య సమతుల్యతను కాపాడి..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 నిబంధనలు ఇక్కడ అత్యంత కీలకం. రాజ్యాంగ రూపకర్తలు సమాఖ్య స్ఫూర్తిని రక్షించడానికి, ఏ ఒక్క పార్టీ కూడా రాజ్యాంగాన్ని ఏకపక్షంగా మార్చకుండా ఉండటానికి 'ప్రత్యేక మెజారిటీ' (మూడింట రెండు వంతుల మెజారిటీ) నిబంధనను చేర్చారు. ఈ నిబంధన ప్రాముఖ్యత ఈ ఓటింగ్‌లో స్పష్టంగా కనిపించింది. కేవలం సంఖ్యాబలం ఉన్నంత మాత్రాన సమాఖ్య వ్యవస్థ ప్రాతిపదికలను మార్చడం సాధ్యం కాదని ఈ ఫలితం నిరూపించింది. రాజ్యాంగ రూపకర్తలు ఆశించిన సమాఖ్య సమతుల్యతను కాపాడటంలో ఈ మూడింట రెండు వంతుల మెజారిటీ నిబంధన రక్షణ కవచంలా నిలిచింది. నిజానికి ప్రభుత్వం తన సొంత సంఖ్యాబలంపై ఉన్న అతివిశ్వాసంతో ప్రతిపక్షాలను, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలను సంప్రదించకుండా ఏకపక్షంగా ముందుకు సాగింది. ఈ పరిణామం భారత రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల అనివార్యతను మరోసారి చాటిచెప్పింది.

### భయాలను పోగొట్టడంలో విఫలమవ్వడంతో..

జాతీయ పార్టీలు రాష్ట్రాల ప్రయోజనాలను విస్మరించినప్పుడు




ప్రాంతీయ పార్టీలే సమాఖ్య వ్యవస్థకు కాపలాదారులుగా నిలుస్తాయని ఈ ఓటింగ్ ఫలితం స్పష్టం చేస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా విపరీతంగా పెరిగింది. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయి.. సీట్ల సంఖ్యను కేవలం జనాభా ప్రాతిపదికన పెంచడం దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాముఖ్యతను గణనీయంగా తగ్గిస్తుంది. ఈ సహేతుకమైన భయాన్ని ప్రాంతీయ పార్టీలు సమర్థవంతంగా సభలో వినిపించాయి. నిజానికి అభివృద్ధి, జనాభా నియంత్రణ మధ్య ఉన్న ఈ వైరుధ్యాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. జనాభా నియంత్రణ సాధించిన రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సింది పోయి వాటి రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య విరుద్ధం. ఉత్తరాది రాష్ట్రాల్లోని జనాభా పెరుగుదల ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచితే భవిష్యత్తులో దేశ రాజకీయ గమనాన్ని కేవలం కొన్ని రాష్ట్రాలే శాసించే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఈ భయాలను పోగొట్టడంలో విఫలమవ్వడం వల్లే ప్రాంతీయ పార్టీలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఏకతాటిపైకి వచ్చాయి. విప్ జారీ చేసినప్పటికీ అధికార కూటమిలోని కొందరు సభ్యులు ఓటింగ్‌కు గైర్హాజరు కావడం ప్రభుత్వ సమన్వయ లోపాన్ని బహిర్గతం చేస్తోంది.


### బీజేపీ వ్యూహానికి గండికొట్టిన ప్రతిపక్షాలు..

ఈ వైఫల్యం భవిష్యత్తులో ఎన్డీయే ప్రభుత్వానికి అనేక సవాళ్లను విసురుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు, పునర్విభజన బిల్లులు ఇప్పుడు ఉపసంహరణకు గురవ్వడం వల్ల ప్రభుత్వం మహిళా సాధికారత పట్ల చిత్తశుద్ధితో లేదనే ప్రచారం పెరిగే అవకాశం ఉంది. రాజకీయ వర్గాల విశ్లేషణ ప్రకారం బీజేపీ ఈ మహిళా బిల్లును 2028 ఎన్నికలలో ఒక ప్రధాన రాజకీయ ఆయుధంగా వాడుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అయితే ప్రస్తుత ఓటమి ఆ వ్యూహానికి గండికొట్టింది. 2026 తర్వాత జరగాల్సిన పునర్విభజన ప్రక్రియ ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఇది ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య రాజకీయ విభజనను మరింత పెంచవచ్చు. రాజ్యాంగ సవరణలు చేయడానికి అవసరమైన నైతిక బలం, సంఖ్యాబలం ప్రభుత్వం వద్ద లేదనే సందేశం దేశవ్యాప్తంగా వెళ్తుంది. ఇది రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక గొప్ప అవకాశంగా మారుతుంది. మున్ముందు ఇలాంటి పరాభవాలు ఎదురుకాకుండా ఉండాలంటే ఎన్డీయే ప్రభుత్వం తన పనితీరులో మౌలిక మార్పులు చేసుకోవాలి.

### రాజకీయ ప్రయోజనాలకు వాడొద్దు!

ముందుగా ఏకపక్ష నిర్ణయాల సంస్కృతిని వీడి సహకార సమాఖ్య స్ఫూర్తిని అలవరచుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజనపై తలెత్తిన చిక్కుముడులను విప్పడానికి ఒక 'ఉన్నత స్థాయి స్వతంత్ర కమిషన్' ఏర్పాటు చేయాలి. ఈ కమిషన్ కేవలం జనాభానే కాకుండా ఆర్థికాభివృద్ధి, విద్య, జనాభా నియంత్రణ, సామాజిక సూచికలను పరిగణనలోకి తీసుకొని సీట్ల కేటాయింపుపై సిఫార్సులు చేయాలి. ఏదైనా కీలక బిల్లును ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి ప్రాంతీయ పార్టీల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలి. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో అన్యాయం జరగదనే రాజ్యాంగపరమైన హామీని ఇవ్వాలి. అలాగే మహిళా రిజర్వేషన్ అంశాన్ని పునర్విభజన నుండి వేరు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ సవరణలను వాడుకోవడం మానేసి జాతీయ ప్రయోజనాల కోసం ఏకాభిప్రాయ సాధన వైపు అడుగులు వేయాలి. పార్లమెంటరీ కమిటీల ద్వారా బిల్లులను నిశితంగా పరిశీలింపజేసి లోపాలను ముందే సరిదిద్దుకోవాలి. కేవలం అంకెలను చూసి మురిసిపోకుండా ప్రజాస్వామ్యబద్ధమైన ఆమోదం కోసం ప్రయత్నించాలి. అప్పుడే ప్రభుత్వం తన కోల్పోయిన ప్రతిష్టను తిరిగి సంపాదించుకోగలదు. రాజ్యాంగ సవరణ అనేది కేవలం చట్టం చేయడం కాదు. అది దేశ భవిష్యత్తును నిర్దేశించే పవిత్ర ప్రక్రియ అని పాలకులు గుర్తించాలి.

# డొనాల్డ్ ట్రంప్ వైఖరి ప్రపంచానికి ఇచ్చే హెచ్చరిక





ప్రపంచ చరిత్రలో అధికారం మనిషిని ఎంతగా విధ్వంసం చేయగలదో తెలుసుకోవాలంటే, డొనాల్డ్ ట్రంప్‌ను చూస్తే చాలు.. ఆయన కేవలం అమెరికా అధ్యక్షుడు మాత్రమే కాదు, ఒక పెద్ద అద్దం పట్టుకున్న వ్యక్తి. ఆ అద్దంలో ఆయనకు తన తప్ప మరెవరూ కనిపించరు. తనకు నోటికి వచ్చినట్లు మాట్లాడటం, తనకు తోచినట్లు ప్రవర్తించడం, తనకు నచ్చిన వారిని మిత్రులుగా, తనను విమర్శించిన వారిని శత్రువులుగా మార్చుకోవడం.. ఇది ట్రంప్ సహజ జీన్స్ లక్షణం. రాజకీయ జీవిత సారాంశం కూడా..

### ఏసుక్రీస్తుగా చిత్రణ..

ఇటీవల వాటికన్ సిటీలో జరిగిన ఘటన ట్రంప్ నిజ స్వరూపాన్ని ప్రపంచానికి మరోసారి చాటిచెప్పింది. పోప్ లియో-14, ప్రపంచ శాంతి కోసం తపించే ఒక నిర్మలమైన ఆధ్యాత్మిక నాయకుడు. ఆయన ఇరాన్‌తో యుద్ధం మానుకోవాలని, అధికారం ఉన్నవారు శాంతి మార్గాన్ని ఎంచు కోవాలని ఎవరి పేరూ ప్రస్తావించకుండా హితవు చెప్పారు. ఆ మాటలు సాధారణ వ్యాఖ్యలు.. కానీ ట్రంప్ వాటిని తనకు వ్యతిరేకంగా తీసుకున్నారు. ఆ తర్వాత జరిగినదంతా .. పోప్‌ను "బలహీనుడు, దుర్బలుడు" అనడం, "ఇరాన్ దగ్గర అణుబాంబు ఉండటాన్ని సమర్థిస్తున్నారు" అని ఆరోపణలు చేయడం, చివరికి తనను తాను ఏసు క్రీస్తుగా (ఏఐ) చిత్రాలతో చిత్రీకరించుకోవడం.. ఇది ఒక మానసిక అస్థిరతకు నిదర్శనం కాదా?

### ప్రతిదీ వివాదాస్పదమే..

ఇది కేవలం ఒక వ్యక్తి విమర్శ కాదు. ఇది ఒక పాఠం. ఒక దేశ అధ్యక్షుడు ఎలా ఉండకూడదు, ఒక నాయకుడు ఎలా ప్రవర్తించకూడదు, ఒక మనిషి ఎంతగా పతనం చెందగలడు అనేదానికి డొనాల్డ్ ట్రంప్ జీవితం ఒక కేస్ స్టడీ. ట్రంప్ జీవితంలోని ప్రతి అంశం.. ఆయన పెంపకం, వ్యాపార చరిత్ర, వ్యక్తిగత జీవితం, నైతిక విలువలు, రాజకీయ నిర్ణయాలు, అంతర్జాతీయ సంబంధాలు, మహిళల పట్ల వైఖరి, నోటి దురుసుతనం, చట్టపరమైన వివాదాలు ఇలా... ప్రతిదీ వివాదాస్పదమే.

### పోప్‌పై దాడి.. బలహీనుడెవరు?

ట్రంప్ పోప్‌ను 'బలహీనుడు' అని విమర్శించారు. ఇది ఎంత హాస్యాస్పదమైన విమర్శ? పోప్ లియో తన జీవితంలో ఎన్నో ప్రాణాపాయాలను ఎదుర్కొన్నారు.. ఆయన యుద్ధ ప్రాంతాలను సందర్శించారు. ఆయన మాఫియా నుండి బెదిరింపులు అందుకున్నారు. ఆయన దేశాల అధినేతలతో గట్టిగా మాట్లాడతారు.. అలాంటి వ్యక్తి బలహీనుడు ఎలా అవుతాడు? ఒక వ్యక్తి తన చేతిలో అణ్వాయుధం లేకుండా, తన వెనుక సైన్యం లేకుండా, ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశాల అధినేతలను నిలువరిస్తే, అతడు బల హీనుడా? లేదు, అతడు నిజమైన బలవంతుడు. ట్రంప్‌కు ఆ బలం ఎన్నడూ అర్థం కాదు.

### చరిత్రలో అత్యంత చెడ్డ అధ్యక్షుడు..

ట్రంప్ పోప్ లియో-14 తో చేసిన వాగ్వాదం ఆయన సంపూర్ణ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. పోప్ ఒక శాంతి దూత. ఆయన ప్రేమను, సహనాన్ని, క్షమాపణను బోధిస్తారు. ట్రంప్ ఒక విభజనకారుడు. ఆయన ద్వేషాన్ని, అసూయను, ఆగ్రహాన్ని విత్తుతారు.. పోప్ తన వ్యాఖ్యలలో ట్రంప్ పేరును కూడా ప్రస్తావించలేదు. ట్రంప్ మాత్రం పోప్‌ను బహిరంగంగా అవమానించారు. డొనాల్డ్ ట్రంప్‌ను ఒక ప్రపంచ విపత్తు.. అమెరికా చరిత్రలో ఇంత చెడ్డ ప్రవర్తన, ఇంత చెడ్డ పేరు తెచ్చుకున్న అధ్యక్షుడు మరొకరు లేరు.. ఆయన హుందాతనం లేని, నోటి దురుసుతనం ఎక్కువైన, అందరినీ తన మాటలతో, చేతులతో బాధపెట్టే ఒక వ్యక్తి.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

# గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత


ప్రకాశం / తూర్పునాయుడుపాలెం, మహి న్యూస్, ఏప్రిల్ 23 : గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంపుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధుల ద్వారా అందించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర రిక్షాలు, చెత్త సేకరణ డబ్బాలు టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం మంత్రి ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి వివిధ గ్రామాల పంచాయతీ సిబ్బందికి రిక్షాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో నూరు శాతం చెత్త సేకరణ జరగాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి. చెత్తపై పన్ను వేసి జగన్ ప్రజలను వేధిస్తే సీఎం చంద్రబాబు చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి 20 నెలల పాలనలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. గ్రామాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రాలకు జీతాలను సకాలంలో అందించాలని అధికారులకు మంత్రి సూచించారు.

# ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేట నిషేధం..



కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్ 23 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సముద్రంలో మత్స్య సంపద పరిరక్షణ కొరకు అనగా తల్లి చేపలు గుడ్లు పెట్టే సమయంను ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు నిర్ణయించి సముద్రంలో ఇంజన్ తో చేపల వేట చేయు బోట్లపై నిషేధం విధించడం జరిగినది. ఈ చేపల వేట నిషేధం వల్ల మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ 20 వేలు చొప్పున మత్స్యకారుల సేవలో భాగంగా భృతి చెల్లించుటకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ ప్రభుత్వ ఆదేశాలు అమలులో భాగంగా కాకినాడ జిల్లాలో తేదీ 18-04-2026 నాడు మత్స్య కారుల పడవలు ఎన్యుమరేషన్ చేయుట జరిగినది. ఎన్యుమరేషన్ చేసిన 4602 బోట్లు కు సంబంధించిన సిబ్బంది 27070 మంది వివరాలు ఆన్లైన్లో డాటా ఎంట్రీ చేయుట జరిగినది. ఈ డాటా ఎంట్రీ చేసిన ప్రాథమిక లబ్ధిదారుల జాబితా 23-04-26 తేదీన సంబంధిత స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు కార్యాలయం /రైతు సేవ కేంద్రం నందు ప్రచురించడం జరిగినది. ఈ లబ్ధిదారుల జాబితా పై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరం ఉన్న 25-04-26 తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు సంబంధిత గ్రామ మత్స్య సహాయకులు లేదా మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వారికి వ్రాతపూర్వకంగా తెలియజేయవలెను. సదరు అభ్యంతరములు పరిశీలించి ,చర్యలు తీసుకున్న పిదప జాబితాను సిక్స్ స్టెప్ వాలిడేషన్ కి పంపించుటకు చర్యలు తీసుకొనబడునని మత్స్యకారులు అందరూ ఈ విషయాన్ని గమనించ వలసినదిగా కోరుచున్నాము.

# సమాజ అభ్యున్నతి, హితం కోసం భగీరథుడు చేసిన కృషి అందరికీ ఆదర్శం..



కాకినాడ, మహి న్యూస్, ఏప్రిల్ 23 : సమాజ అభ్యున్నతి, సమాజ హితం కోసం పట్టుదల, సంకల్పబలంతో శ్రీ భగీరథుడు చేసిన తపస్సు, కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, కాకినాడ పట్టణం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, సగర సంక్షేమ సంఘం నాయకులు భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో శ్రీ భగీరథుని జయంతి ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. భగీరథుడు గంగను భూమికి తీసుకువచ్చిన మహనీయుడిగా చరిత్రలో నిలిచారని ఆయన తెలిపారు. భగీరథుని పట్టుదల, సంకల్పబలం, సమాజ హితం కోసం ఆయన చేసిన తపస్సు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం, అంకితభావంతో పనిచేయడం వంటి విలువలు భగీరథుని జీవితంలో మనకు స్పష్టంగా కనిపిస్తాయని కొనియాడారు. భగీరథుడు తన పూర్వీకుల విమోచనార్థం గంగను భూమికి తీసుకురావడంలో అపారమైన తపస్సు చేసి సాధించిన విజయాన్ని గుర్తుచేసుకుంటూ, నేటి తరానికి ఆయన జీవితం ప్రేరణగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ వివరించారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. భగీరథుని పేరుతో "భగీరథ ప్రయత్నం" అనే పదం కఠినమైన లక్ష్యాన్ని సాధించడానికి చేసిన మహత్తర కృషిని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. పట్టుదలతో కృషి చేస్తే అసాధ్యమేమీ లేదని, యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని ఎమ్మెల్యే కొండబాబు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి ఏ.శ్యామల కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, సగర కార్పొరేషన్ డైరెక్టర్లు ఇతర సంక్షేమ సంఘాల నాయకులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాడిమొగ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం

## ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు




తాళ్లరేవు (మహి న్యూస్ ) ఏప్రిల్ 23: మండల పరిధిలోని గాడిమొగ గ్రామ పంచాయతీలోని ఐదు అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి గురువారం గ్రాడ్యుయేషన డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాడిమొగ-2 అంగన్వాడీ కేంద్రంలో ఐటీసీ ప్రథమ్ జిల్లా సమన్వయకర్త ఎన్.సందీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీసీ ప్రథమ్ కోనసీమ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.సత్యన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధి. పాఠశాల విద్యకు ముందస్తు సంసిద్ధత కల్పించడమే లక్ష్యంగా ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ సెక్టార్ లోని ఐదు అంగన్వాడీ కేంద్రాల్లోని మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని శారీరక, భాష, మేధో, గణిత, సాంఘిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కేరాఫ్ అడ్రస్ - సాంఘిక సంక్షేమ హాస్టళ్లు!



ఒంగోలు/మార్కాపురం, మహి న్యూస్, ఏప్రిల్ 23 : ప్రకాశం మరియు మార్కాపురం జిల్లాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు కార్పొరేట్ స్థాయి వసతులను కల్పిస్తూ, వారి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి సాంఘిక సంక్షేమ హాస్టళ్లు సిద్ధంగా ఉన్నాయని ప్రకాశం మరియు మార్కాపురం జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఎన్. లక్ష్మా నాయక్, ఎమ్.ఏ. ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్ డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రత్యేక చొరవతో ఈ రెండు జిల్లాల పరిధిలోని హాస్టళ్లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించడానికి మరియు మరమ్మతుల కోసం రూ. 13 కోట్ల భారీ నిధులను కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నిధులతో హాస్టళ్లను ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్ది, విద్యార్థులకు అత్యంత ఆహ్లాదకరమైన మరియు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

### ముఖ్య విశేషాలు మరియు సౌకర్యాలు:

నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ: జిల్లా కలెక్టర్ శ్రీ ఆదేశాల మేరకు, వైద్య మరియు ఆరోగ్య శాఖ సమన్వయంతో హాస్టల్ విద్యార్థులందరికీ క్రమం తప్పకుండా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన మందులు




మరియు వైద్య సలహాలను అందజేస్తున్నాము. అత్యాధునిక వసతులు: కేటాయించిన రూ. 13 కోట్ల నిధులతో హాస్టల్ భవనాలకు మేజర్ మరియు మైనర్ మరమ్మతులు పూర్తి చేసి, విద్యార్థులకు సురక్షితమైన వసతి కల్పిస్తున్నారు.

### విస్తృతమైన వసతి:

ప్రకాశం జిల్లాలో 52 మరియు మార్కాపురం జిల్లాలో 47 హాస్టళ్లు 3వ తరగతి నుండి పీజీ వరకు చదివే విద్యార్థుల కోసం అందుబాటులో ఉన్నాయి.

### పౌష్టికాహారం:

ప్రభుత్వ మెనూ ప్రకారం వారానికి 3 సార్లు చికెన్, 6 గుడ్లు, ప్రతిరోజూ పండ్లు మరియు చిక్కీలతో కూడిన బలవర్ధకమైన భోజనం అందించబడుతోంది.

### వ్యక్తిగత సంరక్షణ:

ప్రతి విద్యార్థికి అవసరమైన కాస్మెటిక్ ఛార్జీలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో పాటు ట్రంక్ బాక్స్, బెడ్ షీట్లు, నోట్ బుక్స్ మరియు క్రీడా సామగ్రి వంటి వస్తువులను ఉచితంగా అందజేస్తున్నారు.

### విద్యా ప్రగతి:

2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో 99.66% ఉత్తీర్ణతసాధించి మన హాస్టళ్లు రికార్డు సృష్టించాయి.

ఆధునిక భద్రత:
భద్రత కోసం సీసీ కెమెరాలు, శుభ్రమైన తాగునీటి కోసం ఆర్ ఓ ప్లాంట్లు, మరియు పరిశుభ్రత కోసం ప్రత్యేక శానిటేషన్ సిబ్బందిని నియమించడం జరిగింది.

### అడ్మిషన్ల వివరాలు (2026--27 విద్యా సంవత్సరం):

ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఓబీసీ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మా నాయక్ కోరారు.

### దరఖాస్తు విధానం:

ఆసక్తి గల విద్యార్థులు/తల్లిదండ్రులు తమ గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ ఉ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ను సంప్రదించవచ్చు.

### సంప్రదించవలసిన కార్యాలయాలు:

మరిన్ని వివరాలకు ఒంగోలు, కొండపి, దర్శి, అద్దంకి, కందుకూరు, మార్కాపురం, గిద్దలూరు, బి.పేట ప్రాంతాల్లోని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులను సంప్రదించగలరు.

# సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులు నిలిపివేత

## ఆంధ్రా సరిహద్దులో నిర్మించడంపై స్థానికుల అభ్యంతరం
## యానాం మురుగునీరు ఆంధ్రాలో నిలువచేస్తారా అంటున్న స్థానికులు




తాళ్ళరేవు మండలం, మహి న్యూస్, ఏప్రిల్ 23.: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు శివారు తూర్పుపేట పరిధిలో ఆత్రేయ గోదావరి నదీపాయ చెంతన జరుగుతున్న గ్రావెల్ ఫిల్లింగ్ పనులను నిలిపివేసినట్లు తాళ్లరేవు మండల తహశీల్దారు పితాని త్రినాధరావు తెలిపారు. గ్రామస్తుల నుండి ఫిర్యాదులు అందడంతో వీఆర్వోను



ఘటనాస్థలికి పంపినట్లు చెప్పారు. ఐదు టిప్పర్లతో భూమిని కప్పిపెట్టి చదునుచేసే పనులు జరుగుతుండగా గుర్తించి వీఆర్వో ప్రశ్నించగా, సంబంధిత వ్యక్తులు నిర్లక్ష్యంగా స్పందించడంతో వాహనాలను తహశీల్దారు కార్యాలయానికి తరలించినట్లు వెల్లడించారు. ఇదే సమయంలో తూర్పుపేట గ్రామస్తులు జక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో తమ కార్యాలయానికి వచ్చి, అక్కడ యానాం ప్రభుత్వ ఆధ్వర్యంలో మురుగునీరు శుద్ధి కేంద్రం నిర్మాణం చేపడుతున్నారని, యానాం ప్రాంతంలోని మురుగు నీటిని అక్కడ నిల్వ చేయనున్నారని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై యానాం రెవెన్యూ, పబ్లిక్ వర్క్స్ విభాగాల అధికారులతో చర్చించగా, అది సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన పనులని వారు వివరించినట్లు చెప్పారు. పనులు జరుగుతున్న భూమి ఆంధ్రాకు చెందినదా లేక యానాం ప్రాంతానికి చెందినదా అనే సందేహం ఉందని, భూమి యాజమాన్యంపై స్పష్టత లేకుండానే పనులు ప్రారంభించడం తగదని తహశీల్దారు పేర్కొన్నారు. టీఎస్ నెంబర్ 7లో ఉన్న సుమారు 82 సెంట్ల భూమిపై వివాదం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సమీప భూమిపై కోర్టు కేసు కూడా నడుస్తుండటంతో, అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. అంతే కాకుండా గాదిరాజు శ్రీదేవి అన్‌రిజిస్టర్డ్ డాక్యుమెంట్లతో సదరు భూమి తనదేనని ఫిర్యాదు చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, భూమి యాజమాన్యంపై స్పష్టత వచ్చేవరకూ, పనులు నిలిపివేయాలని యానాం పబ్లిక్ వర్క్స్ విభాగానికి తెలుయచేసామని, సంబంధిత కాంట్రాక్టర్ కూడా పనులు ప్రస్తుతం ఆపివేసినట్లు తెలిపారు. యానాంఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యిన తరువాత పూర్తి స్థాయి పరిశీలన చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామస్థులు ఎటువంటి ఆందోళనలకు చెందవద్దని, ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోదని తాళ్ళరేవు మండల తహశీల్దారు పితాని త్రినాధరావు స్థానికులకు భరోసా ఇచ్చారు..

# తక్కువ ప్రీమియంతో పెద్ద భద్రత
## కేంద్ర బీమా పథకాలపై బీజేపీ అవగాహన సమావేశం

ఓడి చెరువు ఏప్రిల్ 23(పుట్టపర్తి ఇంచార్జ్)మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ పథకాలు సామాన్య ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వారు సంవత్సరానికి ?436 ప్రీమియం చెల్లించి ?2 లక్షల జీవిత బీమా పొందవచ్చని చెప్పారు. ఏ కారణంతోనైనా మరణం సంభవించినప్పుడు కుటుంబానికి బీమా మొత్తం అందుతుందని వివరించారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల వారు సంవత్సరానికి కేవలం ?20 ప్రీమియంతో ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. ప్రమాదంలో మరణం లేదా పూర్తిగా వికలాంగతకు ?2 లక్షలు, భాగిక వికలాంగతకు ?1 లక్ష పరిహారం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ వీరాంజనేయులు, బీజేపీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి హరి, నాయకులు కిష్టప్ప, వెంకట శివ, మేకల వెంకటరమణ, నాగప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంపల్లి మృతురాలు మల్లేపల్లి ఎల్లమ్మకుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న

గుర్రంపొడు, ఏప్రిల్ 23 ( ప్రభ న్యూస్): తిరుమలగిరి సాగర్ మండలంశ్రీరాంపల్లి వాస్తవ్యులు అయినటువంటి మృతురాలు మల్లేపల్లి ఎల్లమ్మగారి కుటుంబ సభ్యులు అయినటువంటి వారి కూతుర్లు అనూషసునీతలను పరామర్శించి ఆర్థిక సహాయం చేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్నవీరితో పాటు ఈ కార్యక్రమంలో శ్రీరాంపల్లి ఉప సర్పంచ్ గజ్జల శివారెడ్డి,వడిత్య విజయ్,తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ యంపిపి యడవెల్లి దిలీప్ కుమార్ రెడ్డి,కొత్తపల్లి ఫ్యాక్స్ మాజీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్ రెడ్డి,తిరుమలనాథ గుడి మాజీ ఛైర్మన్ బుర్రి రామిరెడ్డి,పెద్దవూర మండలం బి.ఆర్.యస్.వి అధ్యక్షులు రమావత్ రమేష్ నాయక్,అలుగుబెల్లి ఆదిరెడ్డి, కోడుమూరు వెంకటరెడ్డి,రాహుల్, రైడర్ ధనుష్, ఇస్రం ప్రశాంత్, ఇస్రం లింగస్వామి షేక్ అబ్దుల్ కరీం, గజ్జల నాగార్జున రెడ్డి,ఇస్రం లక్ష్మమ్మ,ఇస్రం ఎల్లమ్మ ( మాజీ ఉప సర్పంచ్ ),ఇస్రం ఇద్దమ్మ, కురాకుల నాగమ్మ,కంభంపాటి రజిత,ఇస్రం నర్సమ్మ,బరిగల వెంకటమ్మ,ఆపంగుల వెంకటమ్మ,గార్లపాటి మారమ్మ,కందుల ఎల్లమ్మ,ఇస్రం మంగమ్మ,ఇస్రం కాశమ్మ,బరిగల సాగరయ్య,ఇస్రం చంద్రయ్య మరియు శ్రీరాంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

# గునిపే ఏడుకొండలు కుమారుని వివాహంలో పాల్గొన్న తోట, చంటిబాబు

గోకవరం, ఏప్రిల్ 23, : మండలంలో గాజులపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గునుపే ఏడుకొండల కుమారుడు ప్రశాంత్ హాసిని వివాహ వేడుకల్లో జగ్గంపేట నియోజకవర్గ వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం తోట వాణి, మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు హాజరై వధూవరులను దీవించి ఆశీర్వదించారు దీనిలో పాల్గొన్నవారు గుల్ల ఏడుకొండలు, గాజులపాలెం సర్పంచ్ కమ్మిలి అచ్చిబాబు, గోకవరం మండలం వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు, వైసీపీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, సమ్మెట నాని, తోలేటి రాంప్రసాద్, మడికి మైనర్ బాబు బుల్లా అబ్బులు, బదిరెడ్డి అప్పన్న దొర, సుబ్బయ్య దొర, బత్తుల శ్రీను, జాజులు ప్రసాద్, కొల్లాటి రామకృష్ణ, ఎర్రంపాలెం మాజీ సర్పంచ్ తొట్ట సత్యనారాయణ, దాకా ధర్మరాజు, పెనుగొండ సత్యానందం తదితరులు పాల్గొన్నారు

# సృజన లేడీస్ క్లబ్ సహాయంతో స్కూళ్లకు ప్రొజెక్టర్లు అందజేత

జి. కొండూరు. ఏప్రిల్ 23. : గెయిల్ ఇండియా లిమిటెడ్ ఎన్టీఆర్ జిల్లా .జి. కొండూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సృజన లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యాబోధన చేసేందుకు ప్రొజెక్టర్ మరియు స్క్రీన్ లను అందించడం జరిగింది. కట్టుబడిపాలెం హై స్కూల్ మరియు చెరువు మాధవరం హై స్కూల్ గడ్డమడుగు ప్రైమరీ స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ ప్రొజెక్టర్లను అందజేశారు దాతలు. ఈ కార్యక్రమంలో గేయిల్ సృజన లేడీస్ క్లబ్ అధ్యక్షులు మిట్ట లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. విద్యార్థిని విద్యార్థులు మారుతున్న కాలాన్ని బట్టి టెక్నాలజీని ఉపయోగించుకుంటూ విద్య నేర్చుకోవాలన్నారు . ఉపాధ్యాయులు చెప్పే ప్రతిదీ క్షుణంగా అర్థం చేసుకోవాలి అంటే ప్రొజెక్టర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతిదీ స్క్రీన్ పై చెప్పటం వలన విద్యార్థులు త్వరగా సబ్జెక్టును అర్థం చేసుకుంటారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జి. వైష్ణవి ట్రెజరీ వి కవిత మరియు సృజన లేడీస్ క్లబ్ మహిళ సభ్యులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ . కృతిమ. కొరతను తీర్చాలి సిపిఐ.(ఎంఎల్)..

నందికొట్కూరు ఏప్రిల్ 23 : నందికొట్కూర్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి . పిక్కిలి వెంకటేశ్వర్లు. డిమాండ్ చేశారు. బేస్తవారం నాడు. హెచ్.పీ హిందుస్థాన్ పెట్రోల్ ప్రైవేట్ లిమిటెడ్ పెట్రోల్ బంకును పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ యుద్ధం కారణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువులను కృత్రిమ కొరతగా సృష్టించారు.యుద్ధము అమెరికా ఇజ్రాయిల్ దేశాలక లేక మన భారత దేశము ఇరాన్ దేశాలకా ప్రజలపై మీకు నిజంగా చిత్త శుద్ధి ఉంటే ప్రజల ఎలాంటి ఇబ్బందులు లేకుండా మేరి పరిపాలన చేయాలి అంతేగాని పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువులను కృత్రిమ కొరత ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు చేయడం చాలా బాధాకరం ఇకనైనా మీరు వంకర బుద్ధి మానుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్యవసర వస్తువులైన పెట్రోల్ డీజిల్ గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.లేని పక్షంలో ప్రజలందరూ తిరుగుబాటు చేసి ఉద్యమాలు చేయాల్సి వస్తుందని సి.పి.ఐ ఎం.ఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు. మండల కార్యదర్శి కాటేపోగు స్వామ న్న. లింగాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# రాత్రి పల్లె నిద్ర లో పాల్గొన్న ఎస్సై నాగమణి



గోకవరం, ఏప్రిల్ 23, : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజలపై అవగాహన కల్పించేందుకు పోలీసులు నిర్వహిస్తున్న పల్లెనిద్ర కార్యక్రమం ప్రజలకు మరింత ధైర్యం నింపుతాయ ని గోకవరం అదనపు ఎస్సై నాగమణి తెలిపారు మండలంలో అచ్యుతాపురం గ్రామంలో బుధవారం రాత్రి 10 నిద్ర కార్యక్రమం ఆమె నిర్వహించారు గ్రామ పెద్దల తో సమావేశమై వివిధ చట్టాలపై వారికి అవగాహన కల్పించారు సప్త వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోన్ కాకుండా సమస్యను పరిష్కరించుకునే విధంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆమె సూచించారు గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ఆకుల కాశీ, పిట్ట అరుణ్, నల్లల నాగేశ్వరరావు, చిటికెన సత్యనారాయణ, లంక పెద వెంకన్న, అయిూను నాగేశ్వరరావు, మాత నరసింహం గోక రమేష్, పరుగుల చంటి, గుడిసె వినోద్, పోలీసు సిబ్బంది పవన్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
శుక్రవారం - 24 - ఏప్రిల్ - 2026

# ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అవసరం

### నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి



పులివెందుల /వేంపల్లె మహి న్యూస్ ఏప్రిల్ 23: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సంస్కారం ఎంతో అవసరమని నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి తెలిపారు. వేంపల్లిలోని నారాయణ జూనియర్ కళాశాల మరియు నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం కాన్వకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి వెంకట రామిరెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ విద్యా సంపద అన్ని సంపదలలో ప్రధానమని, విద్యార్థి దశను సద్వినియోగం చేసుకుంటే జీవితంలో రాణించవచ్చని తెలిపారు. అనంతరం కొట్టె నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నాణ్యమైన విద్యతో పాటు విలువల బోధన అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక బాధ్యతలను కూడా అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే వరద



వైయస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు (మహీ న్యూస్, ఏప్రిల్ 23): ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి. ప్రజల ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి త్వరలోనే ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేసి అర్హులకు న్యాయం చేస్తుందని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, మాజీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, సిద్దయ్య, జనసేన మంచి శివకుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, గోకుల్ నగర్ శంకర్ రెడ్డి, వివేకానంద కాలనీ శివ, పల్లేటి రాముడు ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే సమ్మె చేపడుతాం

### సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్



పోరుమామిళ్ళ: ఏప్రిల్ 23: మహి న్యూస్ప్రతినిధి: గత కొన్ని సంవత్సరాలు గడిచిన జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలు గడిచేదెలా?ఎలా అని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పోరుమామిళ్ల గ్రామపంచాయతీ కార్మికులకు సంవత్సరం పైబడి జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా బతకాలి అని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు సఫా, పంచాయతీ నాయకులు నాగేష్ వారి బృందంతో గురువారం పంచాయతీ సెక్రటరీ కి వినతి పత్రం అందించి 30 వ తేదీలోపు వేతనాలు ఇవ్వకపోతే సమ్మెలోకి వెళ్తామని పంచాయతీ ఈవో శ్రీనివాసులు , మండల అభివృద్ధి అధికారులకు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఏఐటీయూసీ నాయకులు పోరుమామిళ్ల పట్టణాన్ని శుభ్రం చేయాలంటే గ్రామపంచాయతీ కార్మికులు అవసరం,అలాంటి,పంచాయతీ కార్మికులకు 9 నెలలు, ఎలక్ట్రిషన్ సిబ్బందికి 13 నెలలు, వాటర్ సిబ్బందికి 15 నెలలు, స్వచ్ఛభారత్ కార్మికులకు 14 నెలలు వేతనాలు ఇవ్వకపోతే ఏ విధంగా కుటుంబాలు గడవాలో అర్థం కాని అయోమయ పరిస్థితిలో ఉన్నారని వారు అన్నారు ఈరోజు అధికారులకు, రాజకీయ నాయకులకు, నీటి సమస్య, లైటింగ్, డ్రైనేజీ కాలువలు పూడిక తీయడం, పంది, కుక్క, బర్రె, అనాధ శవాలు ఎవరు చనిపోయిన పంచాయతీ కార్మికుల అవసరం, ఆగమేఘాల మీద ఇప్పుడే శుభ్రం చేయాలని అధికారులు ఆర్డర్ చేసినప్పుడు, వారికి జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకు అధికారులు చేస్తున్నారు అర్థం కావడం లేదు. అలాగే కార్మికులు వయస్సు అయిపోయిన తర్వాత కుటుంబానికి ఆసరాగా ఒక్క పైసా కూడా ఇవ్వలేని పరిస్థితి, చివరకు మనిషి చనిపోయిన అంత్యక్రియలు కూడా ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడం, అందుకోసమై కార్మికులకు పీఎఫ్,ఈఎస్ఐ చట్టభద్రత కల్పించాలని, నాలుగు సంవత్సరాలయిన బ్లౌజులు, డ్రెస్సులు ఏ ఒక్కటి కూడా ఇవ్వకపోవడం ఈ సమస్యలన్నిటి పైన 29 తేదీ లోపు పరిష్కరించకపోతే, 30వ తేదీ నుండి సమ్మెలోకి వెళ్తామని అధికారులకు తెలియజేయడమైనది, ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క నెల వేతనం ఇవ్వకపోతే బ్యాంకుల చుట్టూ, ఫోన్ చేత పట్టుకొని ప్రదక్షణ చేసే పరిస్థితి అలాంటిది పట్టణాన్ని శుభ్రం చేసే కార్మికులకు వేదనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడం తగదని అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు పిరయ్య, పంచాయతీ కార్మికులు ఓబులమ్మ, శారద, గుర్రప్ప, ఆంథోనీ, నాగార్జున, రమణ, శ్రీరాములు, వెంకటేష్, కరీముల్లా, నాగార్జున, రాయలమ్మ, నాగేంద్ర, కాసిం పీరా, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీకాలజ్ఞాని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి

### 333వ ఆరాధన గురుపూజ మహోత్సవములు



బ్రహ్మంగారిమఠం. మహిన్యూస్. ఏప్రిల్:23 బ్రహ్మంగారిమఠం.శ్రీకాలజ్ఞాని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవములు 23 /4/ 2026వ తేదీ నుండి 28 /4/ 2026వ తేదీ వరకు ఘనంగా నిర్వహింపబడుతున్నాయని కావున భక్తులు ఈ గురుపూజ మహోత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకోవాల్సిందిగా 8వ తరం 12వ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారు భక్తులకు ఆహ్వానం పలికారు

## ఉషోదయ స్కూల్ నందు గ్రాడ్యుయేషన్ డే అత్యంత వేడుకగా ఆహ్లాదకరంగాసంబరాలు



రాజంపేట. మహిన్యూస్. ఏప్రిల్:23 : ఉషోదయ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సంబరాలు ఈరోజు లాస్ట్ వర్కింగ్ డే సందర్భముగా ఉషోదయ స్కూల్ నందు గ్రాడ్యుయేషన్ డే సంబరాలు అత్యంత వేడుకగా ఆహ్లాదకరంగా జరిగాయి. ఈ వేడుకలు ఉషోదయ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సంభావ వినయ్ కుమార్ మరియు డైరెక్టర్ మానస గార్ల ఆధ్వర్యంలో చాలా ఘనంగా ఎంతో ఆహ్లాదకరంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉషోదయ స్కూల్ నందు నర్సరీ నుండి సెవెంత్ క్లాస్ చదువుతున్న ప్రతి విద్యార్థినీ ఘనంగా మెడల్, మెరిట్ సర్టిఫికెట్ మరియు మెమెంటో తో సత్కరించడం జరిగినది. ఈ సందర్భంగా ఉషోదయ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్ మాట్లాడుతూ స్కూల్ను ప్రారంభించిన మొదటి సంవత్సరంలోని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు మేనేజ్మెంట్కు ఎంతో




సహకరించారని ఇలాంటి సహకారం ఫ్యూచర్ లో కూడా లభించాలని అదేవిధంగా విద్యార్థులు క్రమశిక్షణతో అంకితభావంతో చదివి స్కూల్ కి మరియు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్చార్జ్ సౌమ్య మరియు ఫిజికల్ డైరెక్టర్ మురళి మరియు స్కూల్ ఉపాధ్యాయ బృందము విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లింగాల మండలంలో సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న అరటి రైతులు

### మొద్దు నిద్రలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం

### త్రాగు, సాగునీరు లేక రైతులు కన్నీళ్లు పెడుతున్న చలించని ప్రభుత్వం

### ఇరిగేషన్ అధికారులపై మండిపడ్డ ఎంపీ



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 23: ఎత్తిపోతల పథక నిర్వాహణ చాలా అధ్వానంగా ఉందని, లింగాల మండల రైతులు త్రాగు,సాగునీరు లేక రైతులు కన్నీళ్లు పెడుతున్న కనీసం కనికరించలేదని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సాగునీ టి ఎత్తిపోతల పథకం అద్వాన్నంగా ఉండడంతో గురువారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎస్ వి సతీష్ రెడ్డి లు వేముల, లింగాల మండల రైతులతో కలిసి మినీ సెక్రటేరియట్ లో ఉన్న ఇరిగేషన్ కార్యాలయం చేరుకొని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. అలాగే చరవాణిలో జిల్లా కలెక్టర్ తో మోటార్ల పనితీరు, అధికారుల నిర్లక్ష్యంపై చర్చించారు.మోటర్లు సకాలంలో మరమ్మత్తులు చేయించ లేకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల పనితీరు అద్వానంగా ఉందని గతంలో ఉన్నతాధికారులు పరిశీలించే వారిని, నీళ్లు లేక ఇబ్బంది పడుతుంటే తాము ట్రాన్స్ఫార్మర్ తెచ్చినా కూడా నీరు వదలక పోవడానికి కారణం ఏమిటి ? అని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దీంతో అధికారులు ఒక వారం రోజుల లోపు నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.ఒక వారంలోపు మోటర్లు రిపేర్ చేయించి నీరు వదలని పక్షంలో మే 1 న కార్యాలయం ముందు భారీగా నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎత్తిపో సాగునీటి ఎత్తిపోతల పథకం నిర్వహణ అధ్వానంగా ఉన్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వేముల,లింగాల రైతులతో కలిసి ఎత్తిపోతల పథకం కార్యాలయానికి చేరుకొని అధికారులను ప్రశ్నించడం జరిగిందన్నారు అధికార యంత్రాంగం ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉన్నారన్నా రు. లింగాల మండలంలోని అన్ని గ్రామాలలో నీటి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు అలాగే సాగునీటి అవసరాల కోసం భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కోట్ల రూపాయలు వెచ్చించి బోర్లు వేస్తున్నప్పటికీ బోరులో నీరు పడడం లేదన్నారు. ఒకపక్క అరటి రైతులు అరటి ధరలు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడ రాకపోవడంతో అప్పుల పాలవుతున్నారన్నారు. వెలిదండ్ల,కెనాల్, కుంట వద్ద ఉన్న మోటర్లు పనిచేస్తే నీటి ఎద్దడి ఉండేది కాదన్నారు. మోటర్లు రిపేర్ చేయాలంటే అధికార పార్టీ నాయకుల అనుమతులు కావాలని చెబుతున్నారన్నారు. తాము మోటర్లు మరమ్మత్తులు చేపిస్తామన్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గాలి,నీరు వద్ద కూడా చిల్లర రాజకీయాలు ఏంటి అని అధికార పార్టీ నాయకులపై ఆయన మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు పడుతున్న కొంచెం అయినా మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. అధికారులు వచ్చే గురువారం లోపు నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, లేనిపక్షంలో మే ఒకటో తేదీ రైతులతో పాటు నీరు వదిలేంతవరకు నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల, వేముల మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు, ఇతర నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో రాజీపడకూడదు

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 23: ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యు ఎస్, ఏపిఎంఎస్ఐడిసి తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులు వారికి కేటాయించాల్సిన నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయడంతో పాటు, నాణ్యత విషయంలో రాజీపడకూడదని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యు ఎస్, ఏపిఎంఎస్ఐడిసి, ఏపిఈడబ్ల్యూఐడిసి తదితర శాఖలు చేపడుతున్న సివిల్ పనుల పురోగతి, క్వాలిటీ కంట్రోల్ అంశాల పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బి కు సంబంధించి మొత్తం 1886.517 కి.మీ ఉండగా, గత ఏడాది 132 కి.మీ లక్ష్యంగా పెట్టుకోగా, అందులో 123.56 కి.మీ మేరకు కొత్తగా నిర్మించిన, పునరుద్ధరించిన రోడ్డు పనులను పూర్తి చేసి సుమారు 93% పనులను పూర్తి చేశారన్నారు. ఈ ఏడాది కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ -2 కింద 156.93 కి.మీ మేరకు కొత్తగా నిర్మించిన, పునరుద్ధరించిన రోడ్డు పనులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారనీ వాటిని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో రాజీపడకూడదన్నారు. గత ఏడాది ఆదోని డివిజన్ లో 67 కి. మీ మేరకు కొత్తగా నిర్మించిన, పునరుద్ధరించిన రోడ్డు పనులను పూర్తి చేశామని, ఈ ఏడాది కూడా నిర్దేశించుకున్న లక్ష్యాల్లో కూడా ప్రత్యేక దృష్టి ఆదోని డివిజన్ మీద పెట్టామన్నారు. రోడ్లమీద బ్లైండ్ కర్వ్ ఉన్న చోట బుష్ క్లియరెన్స్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ కు సంబంధించి గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులను సెప్టెంబర్ లోపు పూర్తి చేయాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు. సైట్ క్లియరెన్స్‌కు సంబంధించి ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే, వాటిని వచ్చే సోమవారం లోపు పరిష్కరించుకోవాలన్నారు. నాబార్డ్ కింద జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ కు సంబంధించి జల్ జీవన్ మిషన్ కింద 300 పనులు పూర్తి అయ్యామని, ప్రస్తుతం 107 పనులు పురోగతిలో ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలలో 2,260 యూనిట్లకు గాను 104 పూర్తయ్యాయని, 690 పనులు పురోగతిలో ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ కింద పనులను వేగవంతం చేయాలని, అలాగే విద్యార్థులు తిరిగి వచ్చేలోపు (జూన్ నాటికి) హాస్టళ్లలో త్రాగునీటి సౌకర్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని ఆదేశించారు. ఏపీఎంఎస్ఐడీసి కు సంబంధించి క్రిటికల్ కేర్ బ్లాక్ యూనిట్ లో ఆక్సిజన్ పైప్‌లైన్, లిఫ్ట్ సౌకర్యం పనులు మే 31 వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. తదనంతరం క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గర్ల్స్, బాయ్స్ హాస్టల్ లో గుర్తించిన టాయిలెట్, తదితర సమస్యలు కూడా జూన్ చివరి నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఈ డబ్ల్యు ఐ డి సి కింద జరుగుతున్న పనులలో కూడా పురోగతి తీసుకొని రావాలన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసి ఎస్ఈ ఇంద్ర, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ నీటి వనరుల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయండి

నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 23 :- జలధార--జలహారతి కార్యక్రమం కింద నంద్యాల జిల్లాలో గ్రామ నీటి వనరుల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు వాటర్ రిసోర్స్ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, గ్రామీణ నీటి వనరుల సమగ్ర అభివృద్ధి, పనుల వేగవంతమైన అమలు మరియు క్షేత్రస్థాయి పర్యవేక్షణపై సంబంధిత అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. గ్రామ స్థాయి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసి, ఆమోదించిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆమె సూచించారు.

### గ్రామ నీటి వనరుల ప్రణాళికకు ప్రాధాన్యం

ప్రతి గ్రామంలో ఉన్న చెరువులు, కుంటలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, వాటి నిల్వ సామర్థ్యాన్ని 'వార్ప్స్' పోర్టల్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఫామ్ పాండ్స్, పర్కోలేషన్ ట్యాంక్స్ వంటి నీటి సంరక్షణ నిర్మాణాల సమాచారంతో పాటు భూగర్భ జలమట్టంలో వచ్చిన మార్పులను నమోదు చేసి, ఏపీ శాక్ మ్యాప్స్ ఆధారంగా సమగ్ర గ్రామ నీటి వనరుల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ ప్రణాళికలను శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని కలెక్టర్ గడువు విధించారు.

### పనుల గుర్తింపు - వెంటనే గ్రౌండింగ్

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాటర్ రిసోర్స్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లు సమన్వయంతో పనిచేసి కొత్త మరియు పునరుద్ధరణ పనులను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి ఎంపీడీఓ లాగిన్‌కు పంపాలని తెలిపారు. కలెక్టర్ ఆమోదం పొందిన వెంటనే తదుపరి రోజే పనులు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాలతో పోలిస్తే పనుల సంఖ్య తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### కాస్కేడ్ చెరువుల అభివృద్ధిపై దృష్టి

ప్రతి మండలం, నియోజకవర్గంలో ఒక ఉత్తమ కాస్కేడ్ చెరువు అభివృద్ధి పనిని ఆదర్శంగా రూపొందించాలని సూచించారు. ఈ పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### క్షేత్రస్థాయి తనిఖీలు - కఠిన పర్యవేక్షణ

అధికారులు ఉదయం 6 గంటల నుండే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. జియో ట్యాగింగ్‌తో కూడిన ఫోటోలను ఎన్ఆర్జీఎస్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసి పనులు ప్రారంభమైనట్లు నిర్ధారించాలన్నారు.

పనుల అమలులో వేగం - సమీక్షా సమావేశాలు

జిల్లాలో మంజూరైన పనులన్నీ త్వరితగతిన గ్రౌండింగ్ కావాలని, ప్రతి గ్రామంలో కనీసం రెండు పనులు ప్రారంభం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం మరియు సాయంత్రం ఫీల్డ్ విజిట్లు నిర్వహిస్తూ, సాయంత్రం 6:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనితీరును సమీక్షిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

### సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో మెరుగైన ప్రదర్శన అవసరం

సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో జిల్లా వెనుకబడిన స్థానంలో వుందని, అందరూ సమన్వయంతో పని చేసి పనితీరును మెరుగుపరచాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో నీటి వనరుల సమర్థ వినియోగం, పనుల నాణ్యత మరియు వేగవంతమైన అమలుతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 23 : వేసవి తీవ్రత దృష్ట్యా పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.వి నాగ సాయి కుమార్ సూచించారు. గుంటూరు గ్రామీణ మండలం వెంగళాయపాలెం గ్రామ పంచాయతీని గురువారం జిల్లా పంచాయతీ అధికారి సందర్శించారు. సంపద తయారీ కేంద్రంను తనిఖీ చేసి చెత్త నుండి సంపద తయారీకి ప్రణాళిక బద్ధంగా సేకరణ చేసి మెరుగు పరచాలని పంచాయతీ అభివృద్ధి అధికారికి ఆదేశించారు. పంచాయతీలో మోడల్ అమృత్ సరోవర్ చెరువును సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్నీ, గ్రామా పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని తనిఖీ చేశారు. అవసరమైతే మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్, స్వచ్ఛ రథం వినియోగితపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇ.వి.యం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 23 : గుంటూరు గల ఇ.వి.యం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ గురువారం తనిఖీ చేశారు. గోడౌన్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను, గార్డ్ రూంల పరిస్థితి, సీసీటీవీలో పనితీరు, ఇన్వర్టర్ స్థితి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుక్షణం అప్రమత్తంగా పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మల్లీశ్వరి, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎస్.ఇ, గృహ నిర్మాణ సంస్థ ఇన్చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరాయకొండ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి డా.స్వామి



ప్రకాశం / సింగరాయకొండ, మహి న్యూస్, ఏప్రిల్ 23 : సింగరాయకొండలోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను గురువారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సందర్శించారు. రేపటి నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండలకు బయట తిరగవద్దని, చెరువులు కాలువలలో ఈతలకు వెళ్ళకుండా సురక్షితంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను మంత్రి పరిశీలించారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు భోజనం చేయడానికి, మీటింగ్ నిర్వహించేందుకు ఉపయోగించే మీటింగ్ హాల్ కు మళ్లీ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అయ్యేనాటికి వాటికి మరమ్మత్తులు చేయాలని అధికారులకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.

## ఫలించిన శాసన సభ్యులు దేవ వరప్రసాద్ కృషి




సఖినేటిపల్లి, మహిన్యూస్, ఏప్రిల్ 23: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణంను రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అంతర్వేది దేవస్థానం విశిష్టతను, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి కనులు పండగ జరిగే కళ్యాణ వైభోగాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర పండుగగా గుర్తించమని విన్నవించడం జరిగింది. ఏళ్ల చరిత్ర కలిగిన మహిమాన్వితమైన స్వామివారి కల్యాణోత్సవ విశిష్టతను గుర్తించిన ప్రభుత్వం, ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు రాష్ట్ర పండుగగా ప్రకటించింది.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు కింజరపు అచ్చం నాయుడు, కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ లకు రాజోలు నియోజకవర్గం శాసన సభ్యులు దేవ వరప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# మొగిళీశ్వర నేచురల్ విలేజ్ మిల్క్ సెంటర్ ను ప్రారంభించిన మాజీ జడ్పీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా





చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం ఏప్రిల్ 23.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా మొగిళీశ్వర నేచురల్ విలేజ్ మిల్క్ సెంటర్ ను పూజా కార్యక్రమం నిర్వహించి, మిషన్లను స్విచ్ వేసి ప్రారంభిస్తూ గురువారం మాజీ జడ్పీ చైర్మన్ ఎం.బి కుమార్ రాజా ప్రారంభించారు. నాణ్యమైన సరసమైన ధరలకు పాలు పెరుగు మజ్జిగతో పాటు స్వచ్ఛమైన ఆవు పాలతో రుచికరమైన టీ కాఫీ ప్రజలకు అందుబాటులో గురువారం నుండి ఇవ్వబడుతుందని బోడబండ్ల గ్రామానికి చెందిన మండల బీసీ సెల్ అధ్యక్షులు మొగిలి శ్వర తెలిపారు. ఇదే కాక పాలు పెరుగు దగ్గరగా ఉన్న బంగారుపాళ్యం ప్రాంతంలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడునని తెలిపారు. సదా ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని క్రింది నెంబర్ కు ఫోన్ చేయాలని మొగిళీశ్వర తెలిపారు. మొబైల్ నెంబర్..8247823335 ఈ కార్యక్రమానికి మండల వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు శరత్ రెడ్డి, మాజీ మండల వైస్ ఎంపీపీ ఎంబి హిమకర్ రాజా, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, ఎల్లప్ప గౌడ్, ఆర్. కామరాజు, ఎస్.కె షాకీర్, రఘుపతి రాజు, బోడబండ్ల మాజీ ఎంపిటిసి హరి, సుహేల్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, మిట్టపల్లి వెంకటేష్ రెడ్డి, సేట్టేరి మార్కొండ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# తిరుచానూరు శ్రీ పద్మావతీ ఆలయం వద్ద ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు - టిటిడి



తిరుచానూరు,మహి న్యూస్, ఏప్రిల్ 23: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రథమ చికిత్స కేంద్రాన్ని గురువారం ప్రత్యేక పూజలతో టిటిడి ప్రారంభించింది. ఆలయానికి రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఆలయ సమీపంలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



ఈ ప్రథమ చికిత్స కేంద్రం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారు. ఈ కేంద్రం ద్వారా భక్తులకు మరియు తిరుచానూరులో పనిచేసే సిబ్బందికి తక్షణ వైద్య సేవలు, ఫస్ట్ ఎయిడ్, సాధారణ చికిత్సలు అందిస్తారు. చిన్నపాటి అనారోగ్యాలు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి, అవసరమైతే ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించే ముందు రోగులను స్థిరపరిచే సేవలు అందించనుంది. ఈ కార్యక్రమంలో సీఎంవో డా.బి. కుసుమకుమారి, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీ పద్మావతి పరిణయోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..



తిరుమల ,మహి న్యూస్, ఏప్రిల్ 23: తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో ఏప్రిల్ 25వ తేదీ నుండి మూడు రోజుల పాటు జరగనున్న శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలకు టిటిడి ఏర్పాట్లు పూర్తి చేసింది.



టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో పరిణయోత్సవ మండపాన్ని దశావతారం, అష్టలక్ష్మల వంటి ఆధ్యాత్మిక రూపాలతో దాదాపు 100 మంది నిపుణులు అలంకరిస్తున్నారని టిటిడి ఉద్యానవన



డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. పూణేకు చెందిన శ్రీ వేంకటేశ్వర రిలీజియస్ చారిటబుల్ ట్రస్ట్ రూ.30 లక్షలతో వేదికను వైభవంగా ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. మూడురోజులపాటు జరగనున్న ఈ వేడుకలో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనంపై, రెండవరోజు అశ్వవాహనంపై, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు.మరోపక్కఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కన్నులపండుగగా నిర్వహిస్తారు.

# జిల్లాలో బీసీ భవనంతో పాటు కమ్యూనిటీ భవనాలు నిర్మించాలి: ఐక్యవేదిక



విజయనగరం, మహిన్యూస్, ఏప్రిల్ 24: జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీ జ్యోతిని కలిసి బీసీ భవనంతో పాటు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయమని గురువారం ఐక్యవేదిక నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, ఇప్పిలి వెంకట రామారావు, దిమిలి పైడ్రాజు, బూర ఐశ్వర్యా యాదవ్, నమ్మి చంటి బాబు యాదవ్ మాట్లాడుతూ విజయ నగరం జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ప్రజలు 80శాతం మంది వ్యవసాయం, చేతు వృత్తుల మీద ప్రత్యక్షంగాను, పరోక్షంగాను,ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.వీరంతా రాజకీయ, విద్యా, ఉద్యోగ, ఉపాధి వంటి అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు.బీసీ పిల్లలు జిల్లా నలుమూలల నుంచి వచ్చి చదువుకొనుటకు, కోచింగ్ తీసుకొనుటకు, జిల్లాకు వచ్చి అద్దె రూములలో ఉండడం వలన అద్దె చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీసీ ప్రజలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకొనుటకు, సభలు, సమావేశాలు నిర్వహించుకొనుటకు, కమ్యూనిటీ భవనాలు లేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీసీలు, సంబంధిత విద్యార్థులు, చాలా ఏళ్లుగా కోరుతున్న న్యాయమైన సమస్యపై ప్రభుత్వం స్పందించి వెంటనే బీసీ భవనంతో పాటు, కమ్యూనిటీ భవనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోనాడ సతీష్, కొల్లేటి శ్రీను, పాల్గొన్నారు.

# భగీరథుని స్ఫూర్తితో జల సంరక్షణ చేద్దాం

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 23 : భగీరథ మహర్షి స్ఫూర్తితో జిల్లాలో జల సంరక్షణను చేద్దామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చిన భగీరథ మహర్షి మహనీయుడని కొనియాడారు. గంగను భూమికి తీసుకురావడానికి ఆయన కఠోర తపస్సు చేశాడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు, బిసి సంక్షేమ శాఖ అధికారులు, బిసి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తక్కువ ధరతో నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వం లక్ష్యం

పూతలపట్టు, మహి న్యూస్, ఏప్రిల్ 23: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తక్కువ ధరతో నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు గౌ॥ శ్రీ గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు, గురువారం పూతలపట్టు నియోజకవర్గం పరిధిలోనిఅనకంబట్టు హరిజనవాడ నందు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్ బిజిలీ యోజన పథకం క్రింద ఎస్సీ మరియు ఎస్టీ విద్యుత్ గృహ వినియోగదారుకు ఉచితంగా అమర్చిన 2ఖౌ సోలార్ రూఫ్టాప్ యూనిట్లను ఆకనంబట్టు ఎ/ఔ నందు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ. డి. ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్,పూతలపట్టు నియోజకవర్గం శాసనసభ్యులు గౌ॥ డా॥ కలికిరి మురళీ మోహన్. సి ఎం డి తోట శివశంకర్, జిల్లా పార్టీ ప్రెసిడెంట్ షణ్ముఖ రెడ్డి, టిడిపి జనరల్ సెక్రెటరీ సునీల్ కుమార్ యాదవ్, ఎస్పీడీసీఎల్ సూపర్డెంట్ ఇంజనీర్ అమర్ బాబు ఇతర అధికారుల తదితరులు పాల్గొన్నారు, జ్యోతి ప్రజలను గావించి కార్యక్రమాలను ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమలో రూ.250 కోట్లతో 65కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్లునిర్మిస్తున్నామన్నారు. గృహ, వ్యాపార, పారిశ్రామిక విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రాయలసీమలో చేపట్టిన 65 సబ్స్టే షన్ల నిర్మాణం పూర్తయితే లో ఓల్టేజ్ సమస్యలు ఉండవని తెలిపారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 6 లక్షల కనెక్షన్లు మంజూరయ్యాయన్నారు. పూతల పుట్టు నియోజకవర్గంలో అధిక లోడును గుర్తించి 2 నూతన సబ్ స్టేషన్ను నిర్మించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఒకటి బంగారుపాలెం, రెండోది పూతలపట్టు, సుమారు 5 ఎకరాల స్థలం కావలసి ఉన్నది, ప్రజలకు మరియు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయుచున్నాము, విద్యుత్తు చార్జీలు పెంచకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీ వినియోగదారులందరికీ సుమారు రూ.1.25 లక్షల విలువైన 2 కేవీ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూపూతలపట్టు నియోజకవర్గంలోనే 4,200 ఇళ్లకు ఉచిత సోలార్ బిగిస్తున్నామని దీనికి సుమారు రూ.52 కోట్లకుపైగా ఖర్చు అవుతుందన్నారు. పూతలపట్టులోనే రూ.175 కోట్ల ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయన్నారు. సుమారు రూ.77 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయని చెప్పారు. పేద రైతులు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్నారని నియోజకవర్గ ఆదుకోవాలని మంత్రికి తెలిపారు, అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పై పథకం ద్వారా సుమారు జిల్లాలో 43 వేల మంది దరఖాస్తులు సమర్పించారు, జిల్లాలో అన్ని నియోజకవర్గంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్ బిజిలీ యోజన పథకం క్రింద ఎస్సీ మరియు ఎస్టీ విద్యుత్ గృహ వినియోగదారుకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అందులో భాగంగా ఈరోజు ఈ ఎస్సీ కాలనీలో 102 మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడం జరిగిందని తెలిపారు ఇంకను దశలవారీగా ఈ కాలనీలో పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పుర ప్రముఖులు, జడ్పిటిసి, ఎంపీపీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో విద్యార్థులు బాధ్యతగా నడుచుకోవాలి

### - శ్రీ చైతన్య ప్రిన్సిపాల్



యానాం, మహి న్యూస్, ఏప్రిల్ 23.: యానాం శ్రీ చైతన్య విద్యాసంస్థల పాఠశాలలో ఈ రోజు నుంచి వేసవి సెలవులు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.. గత సంవత్సరం నుంచి నిరంతరంగా చదువులు, పోటీ పరీక్షలు, పరీక్షలు, రివిజన్ షెడ్యూల్లతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అలసిపోయారని, అందువల్ల ఈ సెలవులు వారికి ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. అయితే సెలవుల సమయంలో విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల పెంపకం బాధ్యతను పూర్తిగా పాఠశాలలపై వదిలేయకుండా, తల్లిదండ్రులు కూడా సమానంగా భాగస్వామ్యం కావాలని సూచించారు. పిల్లలు ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేయాలని, ముఖ్యంగా అమ్మాయిలు గృహ పనుల్లో భాగస్వామ్యం కావడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. అలాగే అబ్బాయిలు కూడా తండ్రులకు సహాయం చేయడం ద్వారా బాధ్యతను నేర్చుకోవాలని సూచించారు. చదువుతో పాటు జీవన నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని, పిల్లలకు స్వయంగా పనులు చేసుకునే అలవాటు పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ వివరించారు. వేసవి కాలంలో ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి పెట్టాలని, మధ్యాహ్నపు ఎండలో పిల్లలను బయటకు పంపకూడదని, సాయంత్రం తర్వాత మాత్రమే ఆటలకు అనుమతించాలని సూచించారు. జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉంచి, సహజ ఆహార పదార్థాలు, కొబ్బరి నీరు, సంప్రదాయ పానీయాలు ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులను 40 రోజుల పాటు తల్లిదండ్రుల సంరక్షణలో ఉంచుతున్నామని, వారి ఆరోగ్యం, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# ఇసుక వాహనాలన్నింటికి బిల్లులు తప్పనిసరి

## గార, బూరవల్లి, పర్లం ఇసుక రీచ్ లు పరిశీలించిన



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 23: ఇసుక వాహలన్నింటికి బిల్లులు ఇచ్చి పంపాలని భూ గర్భ గణులు శాఖ ఉప సంచాలకులు మోహనరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఆయనతో పాటు ఆయా గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులతో ఆయన గార, బూరవల్లి, పర్లం ఇసుక రీచ్ లురీచ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి, సాంకేతిక సిబ్బంది, సంబందిత గ్రామా రెవిన్యూ అధికార్లు, గార జలుమూరు మండలాల పోలీసు వారికి పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ విషయమై సమాచారం ఇచ్చి గార మండలం లోని గార ఇసుక రీచ్, బూరవిల్లి ఇసుక రీచ్, జలుమూరు మండలం లోని పర్లం, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం, ఆమదాలవలస మండలంలోని కలవరం, దూసి ఇసుక రీచ్ లను పరిశీలించారు. ఇసుక రీచ్ లలో నాణ్యమైన ఇసుకను అందుబాటులో ఉంచి వినియోగదారులకు సరఫరా చేయాలన్నారు. ఇసుక లోడింగ్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇవ్వాలని, వచ్చిన వాహనాలు అన్నిటికి బిల్లుల తీసి ఇచ్చి పంపాలని ఆదేశించారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పై వినియోగ దారులకు అవగాహన కలిగించాలన్నారు. లారీ డ్రైవర్ లకు ఓవర్ లోడింగ్ వేసుకో కూడదని తెలియ పరచాలన్నారు. ఇసుక లోడ్ చేసుకున్న తరువాత పట్టా కట్టుకొని వెళ్ళాలని డ్రైవర్లకు తెలియపరచాలన్నారు. ఇసుక లోడ్ చేసుకున్న తరువాత బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. మాన్సూన్ కు ఇసుక స్టాకులు వేయాలని ఏజెన్సీల సూపర్వైజర్ లకు తెలిపారు. నిబంధనలను అనుసరించి ఇసుక తీసుకువెళ్లాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# 12 మండలాల్లో 'తీవ్ర' వడగాల్పులు

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 23: జిల్లాలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి చేరిందని, శుక్రవారం జిల్లాలోని 12 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం కొత్తూరు మండలంలో అత్యధికంగా 45.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాలోని 10 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 6 మండలాల్లో వడగాల్పులు వీచాయని పేర్కొన్నారు. ఆమదాలవలస, బూర్జ, హీరమండలం, జలుమూరు, కంచిలి, కొత్తూరు, లక్ష్మీనరసుపేట, మందస, నందిగం, పాతపట్నం, సారవకోట, సరుబుజ్జిలి మండలాల్లో శుక్రవారం తీవ్ర వడగాల్పులు వీస్తాయని, గంగువారి సిగడాం, మెలియాపుట్టి మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలని, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి సెలవుల దృష్ట్యా ఏప్రిల్ 24 నుండి జూన్ 11 వరకు ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలలు ఎటువంటి తరగతులు గానీ, శిక్షణ తరగతులు గానీ నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను కాలువలు, చెరువులు, నదుల వద్దకు పంపవద్దు. ఈత రాని వారు లోతైన నీటి వనరుల్లోకి దిగకూడదు. తేలికపాటి పల్చని దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ వాడాలి. తగినంత నీరు, పానీయాలు తీసుకోవాలి. పిల్లలు ఎండలో ఆడకుండా చూడాలి. హీట్ స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి. సెలవుల్లో పిల్లలు నిర్మాణాత్మకమైన, విద్యా సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఆంగ్ల భాష అంతర్జాతీయ సంబంధాల వారధి

## ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు




శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 23: ప్రస్తుత ప్రపంచంలో అంతర్జాతీయ సంబంధాలు, విద్య, వ్యాపారం, సాంకేతిక రంగాలలో ఆంగ్ల భాష కీలక పాత్ర పోషిస్తోందని, ప్రపంచ దేశాల మధ్య భావ వ్యక్తీకరణకు ఇది ఒక వంతెనలా పనిచేస్తుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు పేర్కొన్నారు. గురువారం కళాశాలలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంగ్ల భాషా దినోత్సవ' వేడుకలకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి కె. మౌనిక మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధ కవి, నాటక రచయిత విలియం షేక్స్పియర్ జన్మదినం వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 23న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. నేటి గ్లోబల్ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరూపించుకోవడానికి ఆంగ్ల భాష ఒక ముఖ్యమైన సాధనమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. చిన్నారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి. ఆదిలక్ష్మి, ఆంగ్ల అధ్యాపకురాలు శ్రీమతి పి. కనకదుర్గ, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి

## సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో 'జూనియర్ రెడ్‌క్రాస్' విభాగం ప్రారంభం

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 23 : విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకుని సమాజ సేవలో ముందుండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి. జగన్మోహన్ రావు పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జూనియర్ రెడ్‌క్రాస్ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రథమ చికిత్స, సిపిఆర్ విధానాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. విపత్తులు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడేందుకు ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ విద్యార్థులకు క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. గుండెపోటు వచ్చినప్పుడు చేసే సిపిఆర్, విద్యుత్ షాక్, పాము కాటు, యాంటీషాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితులను ఎలా కాపాడాలో డెమో ద్వారా వివరించారు. స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ రాజేశ్వరి, కరెస్పాండెంట్ సిస్టర్ జోసెఫ్ మేరీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించేందుకు జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్లు పి. రామకృష్ణ, ఎ. రమాదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్



ఎచ్చెర్ల, మహి న్యూస్, ఏప్రిల్ 23: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సండ్ర అమరేంద్ర కుమార్ బుధవారం శివాని ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పరీక్షలు రాస్తున్న పీయూసీ విద్యార్థుల సౌకర్యాలను, పరీక్షా నిర్వహణ తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యవేక్షణలో రిజిస్ట్రార్‌తో పాటు ఆర్జీయూకేటీ పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, క్యాంపస్-2 ఇంచార్జి సాగర్, వెల్ఫేర్ డీన్లు సింహాచలం, యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# జలధార - జలహారతి పెద్ద ఎత్తున చేపట్టాలి

## ఐ అండ్ సిఎడి స్పెషల్ కమీషనర్ సాయి ప్రశాంతి

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 23: జలధార-జలహారతి పెద్ద ఎత్తున చేపట్టాలని ఐ అండ్ సిఎడి స్పెషల్ కమీషనర్ సాయి ప్రశాంతి పేర్కొన్నారు. 22ఎ తీసివేత, రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు, సోలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్స్ కు గ్రామీణ, పట్టణాలకు భూ సేకరణ, జలధార ప్రాజెక్టులపై జిల్లా కలెక్టర్లతో వివిధ శాఖాధిపతులు గురువారం విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ భారత్ మిషన్ ప్రణాళికలకు అనుగుణంగా ఘణవ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ వాటిపై తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వచ్ సర్వేక్షణ్ - 2025-26 కార్యాచరణ లో భాగంగా పట్టణ స్థానిక సంస్థల్లో ఓడిఎఫ్ ప్లస్ (బహిరంగ మలవిసర్జన) రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని పబ్లిక్ టాయ్ లెట్లు, కమ్యూనిటీ టాయ్ లెట్లు పునరుద్ధరించాలన్నారు. జలధార జలహారతి పై ప్రజలను చైతన్య వంతులను చేసి విరివిగా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డ్వామా పీడీ లవరాజు, సర్వే అండ్ లాండ్ రికార్డులు ఎడి జోషిలా, తదితరులు పాల్గొన్నారు.

## ఈ-కేవైసీ వేగవంతం చేసి పాస్ పుస్తకాల జారీకి చర్యలు



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 23 : రీసర్వే పూర్తయిన రెండు గ్రామాల్లో పట్టాదార్ పాసుపుస్తకాల జారీకి సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి సి.సి.ఎల్.ఏ గురువారం జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసి, ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, సర్వే శాఖ ఉప సంచాలకులు తోయజాక్షజ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి

## కఠోర పరిశ్రమకు మారుపేరు భగీరథ మహర్షి



గుంటూరు, మహి న్యూస్, ఏప్రిల్ 23 : కఠోర పరిశ్రమకు మారుపేరు భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి బి.సి సంఘాల నాయకులతో కలిసి భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథుడు మహా జ్ఞాని, పరోపకారానికి పెట్టింది పేరు అన్నారు. దీక్షకు, సహనానికి ప్రతిరూపమని, ఎంత కష్టాన్నయినా భరించి అనుకున్నది సాధించే గొప్ప లక్షణం కలిగిన వ్యక్తి అన్నారు. భావి తరాలు భగీరథుని చరిత్రను మననం చేసుకుని స్ఫూర్తిని పొందాలని అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కఠోర పరిశ్రమకు భగీరథ ప్రయత్నం చేశారని నానుడిని గుర్తు చేశారు. భగీరథుడు ఎంతో కష్టపడి దివి నుండి గంగను భువికి తీసుకొచ్చారని అన్నారు. యువత మంచి భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని, కష్ట పడితే సాధించలేనిది ఏదీ లేదని గుర్తించాలని సూచించారు. యువతకు ప్రపంచంలో అనేక అవకాశాలు ఉన్నాయని, అందుకు అవసరమైన నైపుణ్యం సాధించాలని అన్నారు. భగీరథ మహర్షి వంటి మహానుభావుల జయంతి వేడుకలు నిర్వహించుకోవడం అంటే, వారిలో ఉన్న కష్టపడే తత్వం, త్యాగాలు, సమాజానికి అందించిన నైతిక విలువలు మననం చేసుకోవడం, వాటిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, బి.సి సంఘాల నాయకులు వేములకొండ శ్రీనివాస్, జంపని నాగేశ్వర రావు, షేక్ షూకుర్, రాజకొండ నాగేశ్వర రావు, గొణుగుంట్ల సుధీర్, కె.వెంకయ్య, సందేటి సాంబశివరావు, కర్నాటి శివ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



## జిల్లాలో 908 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ లకు శాంసంగ్ 5 జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 23:- గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీఓఏ) లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో డి.ఆర్.డి.ఎ-సెర్ప్ కు సంబంధించిన వివోఏ లకు మొబైల్ ఫోన్స్ ను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసే దిశగా జిల్లాలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ స్మార్ట్‌ఫోన్లు కీలకంగా ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని మొత్తం 908 మంది వీఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యాధునిక 5+ సదుపాయం కలిగిన శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేయడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్లు గ్రామీణ మహిళా సంఘాల అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సంఘాల ఆర్థిక లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సులభతరం అవుతుందన్నారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని వేగవంతంగా గ్రామీణ ప్రజలకు చేరవేయడంలో స్మార్ట్‌ఫోన్లు కీలకంగా ఉపయోగపడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సాంకేతికత వినియోగం మరింత విస్తరించాలని, వీఓఏ ఈ సదుపాయాన్ని సమర్థంగా వినియోగించి సంఘాల పురోగతికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి రమణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణతో భూగర్భ జలాల పెంపు




కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 23: వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకునే విధంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సి.సి.ఎల్.ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. వర్షకాలం ప్రారంభానికి ముందే జిల్లాలోని అన్ని చెరువులు నీటితో నిండేలా చర్యలు వేగవంతం చేయాలని ఆమె ఆదేశించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీలు సురేష్ కుమార్, హరి జవహర్లాల్, జయలక్ష్మి, ప్రశాంతి పాల్గొని జలధార--జలహారతి, నిషేధిత భూ జాబితా, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువుల్లో అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.... జిల్లాలో జలధార--జలహారతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి చెరువులు, పంటకాలువలు, నీటి కుంటలలో పూడికలు తొలగించి వర్షపు నీటిని నిల్వ చేసుకునే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే 22-ఏ నిషేధిత భూ జాబితా, రీ-సర్వే, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ-కైవైసీ మరియు వెబ్‌ల్యాండ్‌లో అవసరమైన సవరణలు పూర్తి చేసి, డ్రాఫ్ట్ పాస్‌బుక్స్ సిద్ధం చేసి హక్కుదారులకు అందజేసి ధృవీకరణకు అవకాశం కల్పించాలని తెలిపారు. గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పనులను నాలుగో, ఐదో దశల్లో పూర్తి చేయడానికి రైతులకు నోటీసులు జారీ చేసి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద కంప్రెస్డ్ బయోగ్యాస్ యూనిట్లు, పీఎస్టీపీ, ఎస్టీపీ వంటి వ్యర్థ నిర్వహణ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన భూమిని వెంటనే గుర్తించి సేకరించాలని సూచించారు. జిల్లాలోని 481 గ్రామాల్లో గుర్తించిన 3,435 జలధార--జలహారతి పనులను వేగంగా ప్రారంభించి పూర్తి చేయాలని, ముఖ్యంగా 239 చెరువులు, అటవీ చెరువులు, పంటకాలువలు మరియు నీటి కుంటల అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని ఆదేశించారు. దేవాలయాల పుష్కరిణులు, కోనేరులు, ధర్మ చెరువులను కూడా ఈ కార్యక్రమంలో చేర్చి, వాటిలో పేరుకుపోయిన చెత్త, పాచిని తొలగించి నీటి ప్రవాహ మార్గాలను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే స్థానిక దేవాలయ నిధులతో వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ చిరంజీవి, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బాలచంద్రారెడ్డి, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఎస్‌డీసీ నాగప్రసూన, డీడీ ఫిషరీస్ రంగనాథ్ బాబు, గ్రౌండ్ వాటర్ డీడీ సునీల్ కుమార్, ఏడి సర్వే మురళీకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నంద్యాల పెద్ద చెరువు అభివృద్ధికి కార్యాచరణ ప్రారంభం

### త్వరలో ప్రజలకు 2.5 కి.మీ. వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 23 :- నంద్యాల పట్టణంలోని పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం వాటర్ రిసోర్సెస్ శాఖ అధికారులతో కలిసి చెరువు పరిసరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చెరువు చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రాక్‌ను సౌకర్యవంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో గ్రీనరీని పెంపొందిస్తూ, షేడ్ పగోడాలు ఏర్పాటు చేసి అందమైన వాతావరణాన్ని సృష్టించేందుకు బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. చెరువు కట్టను ఆక్రమణల నుంచి రక్షించేందుకు బౌండరీ ఫిక్సింగ్, ఫెన్సింగ్, ట్రెంచెస్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కట్టను శాశ్వతంగా సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే సివిల్ పనులను పూర్తి చేసి, వర్షాలు ప్రారంభమైన వెంటనే విస్తృతంగా మొక్కలు నాటి గ్రీనరీని పెంపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పాలేరు వాగు, చామ కాలువలతో అనుసంధానమై సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తే, నంద్యాల పట్టణానికి ఒక విలువైన ఆస్తిగా మారుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ శివ శంకర్ రెడ్డి, కేసి కెనాల్ డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం

### జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్

నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 23 :- భగీరథ మహర్షి పట్టుదల నుండి అందరూ స్ఫూర్తి పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ కలెక్టర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని భగీరథ చిత్రపటానికి డిఆర్ఓ, సగర ఉప్పర సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సగర (ఉప్పర) వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ కుమార్ ఉప్పరి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గోవర్ధన్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు, హాస్టల్ వార్డెన్ ఇంచార్జ్ డి.మునిరాజు, బీసీ వెల్ఫేర్ సెక్రటరీ షబ్బీర్, నంద్యాల అసెంబ్లీ సంఘం అధ్యక్షుడు బి.బాలాజీ, యువజన సంఘం అధ్యక్షుడు యు.హరికిరన్, డా.గురు ప్రసాద్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ భగీరథ మహర్షి గంగను భూమిపైకి తీసుకువచ్చిన పట్టుదల, జల సంరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని, ఆయన త్యాగనిరతి ఆదర్శనీయమని కొనియాడారు. కఠోర శ్రమ చేసి దేనినైనా సాధించగలమని భగీరథ మహర్షి నిరూపించారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. వెనుకబడిన తరగతుల వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపడుతున్న కార్యాచరణను పూర్తిస్థాయి ఫలాలు వారికి అందేలా నిరంతరం కృషి చేస్తామన్నారు. విద్యార్థులు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు.

## స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి

### జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 23:- స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలి జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ పార్టీ ప్రతినిధి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రియాజ్ బాషా, బిఎస్పీ పార్టీ ప్రతినిధి శ్రీనివాసులు, టిడిపి పార్టీ ప్రతినిధి శివరాం రెడ్డి, వైఎస్సార్సీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... స్వచ్ఛమైన తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు, మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. జిల్లాలో 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటర్ జాబితాకు సంబంధించి ఎటువంటి అనుమానాలు, సందేహాలు ఉన్నట్లయితే తమ పరిధిలోని బిఎల్ఓ లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామన్నారు.

# కర్నూలు జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### యువతను కాపాడటం అందరి బాధ్యత - జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 23: నషా ముక్త్ భారత్ ద్వారా యువతకు అవగాహన కల్పించి కర్నూలు జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం పోలీస్ శాఖ ఈగల్ ఆధ్వర్యంలో నగరం లోని రాజ్ విహార్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన వాకథాన్ లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువత ఎక్కువగా ఆల్కహాల్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, వీటి కారణంగా అనేక మంది యువకుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకుంటున్న ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్న ఉదాహరణలు మన ముందున్నాయని పేర్కొన్నారు. పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల దుష్ప్రభావాలను వివరించడం జరుగుతోందని తెలిపారు. అదేవిధంగా డ్రగ్స్‌కు బానిసైన వారికి పునరావాసం కల్పించేందుకు డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి, సైకియాట్రిస్టుల ద్వారా చికిత్స అందిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారు ఎవరితో తిరుగుతున్నారు, వారి అలవాట్లు ఎలా ఉన్నాయో గమనిస్తూ ఉండాలని సూచించారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు కనిపించినప్పుడు వెంటనే స్పందించి సరైన మార్గంలో నడిపించాలని కోరారు. దేశవ్యాప్తంగా సుమారు 16 కోట్ల మంది మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్న కలెక్టర్, ఈ సమస్యను ఎదుర్కోనడం కోసం సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రభుత్వం కూడా పాఠశాల స్థాయిలో యోగా, ధ్యానం, నైతిక విలువలపై అవగాహన కల్పిస్తూ యువతను సరైన దిశలో నడిపించే ప్రయత్నాలు చేస్తున్నదని వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలన ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాను పూర్తిగా మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

### జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ...

మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజానికి కూడా తీవ్రమైన హానిని కలిగిస్తుందని తెలిపారు. అవగాహనతోనే ఈ సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.."నషా ముక్త్ భారత్" లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఈగల్ ఎస్సై సుజన్ కుమార్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# ఏప్రిల్ 24 వ తేదీన క్యాట్, సెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 23: 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 24 వ తేదీన క్యాట్, సెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయముల సంస్థ 2026-27 విద్యా సంవత్సరమునకు 5, 6, 7, 8 వ తరగతులకు ప్రవేశ పరీక్ష కొరకు జూ నిర్వహణ ఉ ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరం కొరకు సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ కు సంబంధించి సంబంధిత అధికారులతో, చీఫ్ సూపరింటెండెంట్ లతో కలెక్టర్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 24 వ తేదీన క్యాట్ (5, 6, 7 మరియు 8వ తరగతులు) ప్రవేశ పరీక్ష ఉ.10 గం.ల నుండి మ.12 గం.ల వరకు 27 పరీక్షా కేంద్రాలలో జరుగుతుందన్నారు. 6310 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. అదే విధంగా సెట్ (ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ మొదటి సంవత్సరం) ప్రవేశ పరీక్ష మ.2.30 గం.ల నుండి సా.5 గం.ల వరకు 35 పరీక్షా కేంద్రాలలో జరుగుతుందన్నారు. 7613 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష రాసే వారిలో 15% మంది విద్యార్థులు మన జిల్లా నుంచి ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగినంత మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వేసవి దృష్ట్యా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యార్థం అన్ని బస్టాండ్ల నుండి పరీక్షా కేంద్రాలకు నిరంతరం బస్సు సర్వీసులు నడపాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎండాకాలం కాబట్టి కొంచెం క్షుణ్ణంగా పర్యవేక్షించవలసిందిగా కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ మరియు జిరాక్స్ సెంటర్లను ఆ రోజు మూసివేయాలని కలెక్టర్ తహశీల్దార్ ను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పరిశుభ్రత, తాగునీరు, మెడికల్ క్యాంపులు ఖచ్చితంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా గదులు ఉండాలన్నారు. గదులు నీట్‌గా ఉండటంతో పాటు కిటికీలు తెరిచి ఉంచి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు కింద కూర్చుని పరీక్ష రాయకూడదని, ఫర్నిచర్ అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకవేళ లేకపోతే వాటిని అద్దెకు తీసుకుని అయినా సరే ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్విజిలేటర్లకు మొబైల్ ఫోన్లను అనుమతించరాదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంచార్జి డిఆర్ఓ చిరంజీవి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, కన్వీనర్ ప్రిన్సిపాల్ పుష్ప రాజ్, చీఫ్ సూపరింటెండెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి స్ఫూర్తితో జలధార జలహారతి కార్యక్రమం అమలు



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 23: భగీరథ మహర్షి స్ఫూర్తితో కర్నూలు జిల్లాలో జలధార జల హారతి కార్యక్రమాలతో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ భగీరథ మహర్షి రాష్ట్రస్థాయి జయంతి సందర్భంగా శ్రీ భగీరథ మహర్షి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి తపస్సు, సంకల్పం, పట్టుదలతో గంగను భూమిపైకి తెచ్చిన గొప్ప ఆదర్శాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. భగీరథ మహర్షి కృషి మనకు నీటి విలువను గుర్తు చేస్తుందని తెలిపారు. జిల్లాలో నీటి వనరులు తక్కువగా ఉండటం వల్ల నీటి సంరక్షణ అత్యవసరమని చెప్పారు. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 8000 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేపట్టామని, దీన్ని మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వరి పంటకు అధికంగా నీరు అవసరమవుతుందని, అందువల్ల వరి సాగును తగ్గించి ఇతర పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. దీంతో నీటి వినియోగం తగ్గి ఇతర పంటలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నీటి భద్రత కోసం జలధార--జలహారతి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పాత చెరువులు, కాలువలు పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ చేసి పునరుద్ధరిస్తున్నామని జిల్లాలో 246 ఎంఐ చెరువులు, 435 కుంటలు ఉన్నాయని, వాటిని పూడికతీత చేసి కాలువల ద్వారా నీటిని నింపి భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. చెరువులను అనుసంధానం చేయడం ద్వారా ఒక చెరువులోని అదనపు నీటిని మరొక చెరువుకు మళ్లించి నీటి వృథాను నివారిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 3445 పనులను గుర్తించి అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ చర్యల వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్‌వెల్స్ సక్రమంగా పనిచేస్తాయని, వేసవికాలంలో నీటి సమస్య తగ్గుతుందని తెలిపారు. జిల్లాలో భూగర్భ జల మట్టాన్ని 3 మీటర్ల వరకు తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. ఈ పనుల్లో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కార్మికులను వినియోగిస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలని, ముఖ్యంగా నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతి సంపదలను, నీటి వనరులను కాపాడుతూ రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. నీటి భద్రత, ప్రకృతి పరిరక్షణ విలువలను పెద్దలు చిన్నవారికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

### భగీరథుని తపస్సు, సంకల్పం నేటి తరానికి స్ఫూర్తి - పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ...శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను రాష్ట్ర స్థాయి లో కర్నూలు జిల్లాలో నిర్వహించడం పట్ల ఆనందమన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మహర్షి భగీరథుడు తన అపారమైన సంకల్పం, అచంచలమైన దీక్ష, తపస్సుతో గంగను భూమిపైకి తీసుకువచ్చి మానవాళికి మహోపకారం చేసిన మహనీయుడని ఆమె కొనియాడారు. ఆయన ఉప్పర సాగరకులానికి చెందినవారని, ఆ కులానికి గొప్ప చరిత్ర సాంప్రదాయం ఉందని పేర్కొన్నారు. భగీరథ మహర్షి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజం మేలు కోసం చేసిన తపస్సు, ఆయన చూపిన మార్గం నేటి తరానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో 52 బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తోందని వివరించారు. భగీరథుడు మాదిరిగా ప్రతి ఒక్కరూ తమకే పరిమితం కాకుండా సమాజం కోసం పనిచేయాలనే సంకల్పాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

### భగీరథుని సంకల్పం స్ఫూర్తిగా ముందుకు సాగాలి -- పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ఈ సందర్భంగా పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ..., శ్రీ శ్రీ శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను కర్నూలు జిల్లాలో నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన భగీరథుని పట్టుదల, తపస్సు, అచంచల సంకల్పం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. భగీరథ మహర్షి గొప్ప చరిత్ర కలిగిన మహనీయుడు అని, ఆయన జీవితం సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తిని అందిస్తుందని అన్నారు. ఉప్పర సాగర కులంలో పుట్టిన ప్రజల్లో కట్టుబాటు, కష్టపడే స్వభావం, సమాజం పట్ల బాధ్యత ఉన్నతంగా ఉంటుందని ఆయన వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సమాజంలోని అన్ని వర్గాలకు గౌరవం లభిస్తోందని తెలిపారు. భగీరథుని మాదిరిగా ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాల సాధనలో పట్టుదలతో ముందుకు సాగుతూ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

### బీసీలకు ప్రాధాన్యత -- మహిళా విద్యతోనే అభివృద్ధి: భగీరథుని స్ఫూర్తితో ముందుకు సాగుదాం -- గుడిసె కృష్ణ

టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణ మాట్లాడుతూ....బీసీలు మరియు వెనుకబడిన వర్గాలకు పదవులు కల్పించి వారికి ప్రాధాన్యతనిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. భగీరథుడు మహర్షి కంటే గొప్ప వ్యక్తి అని పేర్కొంటూ, గంగాదేవిని భూమికి తీసుకువచ్చిన ఆయన సంకల్పం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ప్రస్తుత కాలంలో అభివృద్ధి సాధించాలంటే విద్యే ప్రధాన మార్గమని, ముఖ్యంగా ఆడపిల్లలను చదివిస్తే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. అలాగే, భగీరథుని స్ఫూర్తిని నిలబెట్టేందుకు ఆదోనిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయడానికి తాము పూర్తి సహకారం అందిస్తామని గుడిసె కృష్ణ తెలిపారు.

### బీసీల గౌరవం కోసం ప్రభుత్వ కృషి అభినందనీయం -- ఉప్పర సాగర సంఘం చైర్మన్ వెంకట రమణప్ప

ఉప్పర సాగర సంఘం చైర్మన్ వెంకట రమణప్ప మాట్లాడుతూ... బీసీలలో పుట్టిన మహర్షులను గుర్తించి వారి జయంతులను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అని అన్నారు. ప్రత్యేకంగా ఎన్నికల ముందు నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో సాధికార కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా బీసీలకు రాజకీయంగా, సామాజికంగా మరింత బలం చేకూరిందని పేర్కొన్నారు. అలాగే ఎన్టీ రామారావు పార్టీ స్థాపించిన నాటి నుంచే బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సమాజంలో ప్రతి వర్గాన్ని గౌరవించడం, సమాన అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు బీసీల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంతో పాటు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని వెంకట రమణప్ప అభిప్రాయపడ్డారు. అనంతరం బీసీ వసతి గృహాల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శాలువాతో సన్మానించి, మెడల్స్ తో అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన్న, ఉప్పర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, జిల్లా ఉప్పర సంఘం అధ్యక్షులు శివన్న, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, డిసిఎంఎస్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర యాదవ్, రాష్ట్ర ఉప్పర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.వి ప్రసాద్, రామ గిడ్డయ్య, సురేష్ బాబు, జాతీయ బిసి అధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు. బి.సి కుల సంఘ నాయకులు మాదన్న, కోడుమూరు రాముడు, జిల్లా అధ్యక్షులు గోనబావి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

### మూడు రోజులపాటు జగన్ బిజీ బిజీ జగన్ ను కలిసేందుకు భారీగా తరలివచ్చిన జనాలు

# ముగిసిన జగన్ పర్యటన

పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 23: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల మూడు రోజుల పర్యటన గురువారం తో ముగిసింది. జనాలతో మమేకమై బిజీ బిజీగా గడిపారు. మొదటి రోజు పులివెందుల చేరుకున్న జగన్ నాయకుల, ప్రజల, కార్యకర్తల, మధ్య బిజీగా గడిపారు. రెండవ రోజు లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, నూతన వధూవరులను ఆశీర్వదించి, శివాలయంలో ప్రత్యేక పూజ కార్యక్ర మం లో పాల్గొని, దారి పొడవునా ప్రజలతో మమేకమై వారిని ఆప్యాయంగా పలకరించారు. అక్కడనుండి పులివెందులలోని ఆయన కార్యాల యం చేరుకుని అక్కడికి వచ్చిన నాయకులు కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గురువారం తిరుగు ప్రయాణంలో ఆయనను కలిసేందుకు నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీగా తరలి వచ్చారు. వచ్చిన వారిని ఆయన ఆప్యాయంగా పలకరించారు. ఉదయం ఆయన హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. జగన్ వెళ్ళిపోయాడు వద్దకు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న నాయకులు కొంతమందికి అక్కడే చేరుకున్నారు వారిని ఆయన ఆప్యాయంగా పలకరించి వారితో మాట్లాడి అనంతమైన హెలిపాడ్ లో బెంగళూరుకు తిరుగు ప్రయాణంలో వెళ్లారు. ఆయనతోపాటు ఎంపీ అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట

**గాలివీడులో 92 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం.**

**అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి**





గాలివీడు:ఏప్రిల్23(మహి న్యూస్): మండలంలో నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గాలివీడులో ఆధునిక సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి తెలిపారు. గురువారం రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌తో కలిసి గాలివీడు పోలీస్ స్టేషన్‌లో ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ప్రజల భద్రత కోసం మొత్తం 92 కెమెరాలను ఏర్పాటు చేయగా, అందులో 68 సోలార్ కెమెరాలు ఉండటం విశేషం.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక కాలంలో నేరాల అదుపునకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఈ వ్యవస్థ నేరస్థుల గుండెల్లో వణుకు పుట్టిస్తుందని తెలిపారు.కిడ్నాప్‌లు, దొంగతనాలు, హత్యలు వంటి నేరాలను అరికట్టడంలో నిఘా కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 92 సీసీ కెమెరాల ద్వారా మండలంలోని ముఖ్య కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, నివాస ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన మిస్సింగ్ కేసు, దొంగతనం, హత్య కేసుల ఛేదనలో కెమెరాలు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయని వివరించారు.ప్రజలు, వ్యాపారులు తమ ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. దీనివల్ల అనుమానితులను గుర్తించడం సులభమవుతుందని తెలిపారు.కెమెరాల ఏర్పాటు కోసం సహకరించిన దాతలు, వ్యాపారులు, రాజకీయ నాయకులను ఎస్పీ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ కృష్ణ నాయక్, ఎస్ఐ నరసింహ రెడ్డి, లక్కిరెడ్డి పల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయవాదులు న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని**



కడప మహీన్యూస్ 23 ఏప్రిల్ 2026: మన ప్రజాస్వామ్య దేశంలోని కార్యనిర్వాహక వ్యవస్థలు చట్టబద్ధంగా నడవకుండా ఉన్న సమయంలో ఆ వ్యవస్థలను చట్టబద్ధంగా నడిచే విధంగా చేసే న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని నిలబెట్టే బాధ్యత న్యాయవాదులపైనే ఉంటుందని కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని అన్నారు. భారత న్యాయవాదుల సంఘం ( ఐ ఏ ఎల్ ) కడప ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నూతన కడప నగర కమిటీ అధ్యక్షులు వి. రాజగోపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనురాధ, ప్రధాన కార్యదర్శి నాగ అర్చన, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ బాలసుబ్బయ్య, నగర ఆర్గనైజర్ కార్యదర్శి రాజశేఖర్ ఉపాధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి కార్యదర్శి వేణుగోపాల్, బాలయ్య తదితరులు గురువారం గౌరవార్థం జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. న్యాయవ్యవస్థ యొక్క ఔన్నత్యాన్ని డిగ్నిటీని కాపాడాల్సిన బాధ్యత కూడా న్యాయవాదులపై ఉంటుందని ముఖ్యంగా న్యాయవాద సంఘాల నాయకుల పై మరింతగా బాధ్యత ఉంటుందని ఆమె అన్నారు.

# టిప్పర్ డీ.... విద్యార్థి కుటుంబానికిఅండగా

**జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత**



కడప మహీన్యూస్ ఏప్రిల్ 23: టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో తొండూరు బీసీ హాస్టల్ కు చెందిన విద్యార్థి దుర్మరణం పాలవ్వడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎంతో ఉజ్వల భవిష్యతు కలిగిన విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేంపల్లి మండల కేంద్రానికి చెందిన గురు ప్రణీత్ కుమార్(11) తొండూరు బీసీ హాస్టల్ ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడన్నారు. వేసవి సెలవులు ఇవ్వడంతో, అదే హాస్టల్ లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య, తల్లితో కలిసి ఆటోలో సొంతూరు పయనమయ్యాడు. వాటర్ బాటిల్ కొని తిరిగి వస్తుండగా, టిప్పర్ లారీ గురు ప్రణీత్ కుమార్ ను ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో బాలుడి కుడికాలు నుజ్జునుజ్జయిందన్నారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖాధికారులు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యమందించిన వైద్యులు మెరుగైన వైద్యం వెల్లూరులోని రాయల్ ఆసుపత్రికి తరలించాలని సూచించారన్నారు. వైద్యుల సూచన మేరకు అంబులెన్స్ లో తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థి పసి ప్రాయంలోనే మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. తల్లి, అన్నయ్య కళ్లేదుటే ఘోరం జరగడం మరింత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. విద్యార్థి మృతదేహానికి పోస్టు మార్టం చేయించి, బాధిత కుటుంబానికి వెన్నంటే ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వేసవి సెలవులకు ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల వెంటే హాస్టళ్ల నుంచి బయటకు వెళ్లాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని, బస్సులు, ఇతర వాహనాలు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవి సెలవుల్లోనూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. హాస్టళ్ల సిబ్బంది కూడా విద్యార్థుల పట్ల కన్నేసి ఉంచాలని, తల్లిదండ్రులతోనే ఇళ్లకు పంపాలని మంత్రి సవిత స్పష్టంచేశారు

# కులమతాలకతీతంగా గంగమ్మ తల్లి భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించిన మున్వర్ బాషాను

**అభినందించిన మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు**





రైల్వే కోడూరు:మహిన్యూస్. ఏప్రిల్ 23: రైల్వే కోడూరు: గంగమ్మ తల్లి జాతర సందర్భంగా గురువారం రోజు మధ్యాహ్నం పట్టణంలోనే నరసరావుపేట నందు వెలసి ఉన్న శ్రీ గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో కులమతాలకు అతీతంగా గంగమ్మ తల్లి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన అన్వర్ భాష మరియు వారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వారిని అభినందించి కులమతాలకు అతీతంగా ఇలాంటి కార్యక్రమంనీకి ముందుకు రావడంఎంతో శుభసూచికమని రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు ఇలాగే ఎంతో కలిసిమెలిసిగా ఉంటూ ప్రతి పండగలను అందరూ కలిసికట్టుగా నిర్వహించుకోవాలని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి. కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్. మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయి కిషోర్ రెడ్డి, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు మాదినేని వెంకటరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మేంబర్ నందా బాల, పట్టణ అధ్యక్షుడు సిహెచ్,ఎంపీటీసీ గని రాజా కరిముల్లా, సంధాన్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు నారాయణమ్మ, మనీ,

# మహిళల రక్షణకు తిరుగులేని అస్త్రం శక్తి యాప్ - తెదేపా నియోజకవర్గ

**ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**



రాజంపేట. మహిన్యూస్. ఏప్రిల్:23: రాజంపేట పట్టణం నియోజకవర్గ పార్టీ కార్యాలయం రాజంపేట. అన్ని రంగాలలో దూసుకుపోతున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం " శక్తి యాప్ " ద్వారా తిరుగులేని భద్రత కల్పిస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. గురువారం నాడు రాజంపేట పట్టణం, స్థానిక వజ్రం కళ్యాణమండపం నందు పోలీస్ శాఖ ఆహ్వానం మేరకు "శక్తి యాప్ " మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట బయట మహిళలకు శక్తి యాప్ ఎంతో భద్రతనిస్తుందని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అదేవిధంగా చమర్తి మాట్లాడుతూ పోలీసుల సలహాలు సూచనలు పాటించి రక్షణ పొందాలన్నారు.గడప దాటితే మహిళకు తిరుగు లేదన్నారు. అంతేకాకుండా మహిళలు స్వేచ్ఛగా బయటకు రావాలనే



ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ "శక్తి యాప్ " ద్వారా మహిళలను చైతన్యవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ మొబైల్ ఫోన్ కేవలం సెల్ఫీలకు, అందం చూసుకునేందుకు కాదని, రక్షణకు కూడా పనికొస్తుందని "శక్తి యాప్" ను గుర్తుంచుకోవాలన్నారు. మొబైల్ మీ దగ్గర ఉంటే భద్రత మీ దగ్గర ఉన్నట్లేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2004లో డ్వాక్రా మహిళల ఆర్థిక శక్తి ఎంతో ప్రపంచానికి చెప్పారన్నారు.పురుషులు వెళితే బ్యాంకు ఏం షూరిటీ పెడతారని అడుగుతున్నారని అదే డ్వాక్రా మహిళలు బ్యాంకుకు వెళితే కేవలం ఆధార్ కార్డు తీసుకువెళ్తే లక్ష నుంచి మూడు రెండు మూడు లక్షల వరకు వరకు కూడా ఎలాంటి షూరిటీ లేకుండా రుణం లభిస్తుందని



జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల సత్తా అంటే ఇదేనన్నారు. ఆర్థిక క్రమశిక్షణ వల్ల డ్వాక్రా మహిళలకు బ్యాంకులో రుణాలు అందిస్తున్నాయని తెలియజేశారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించారని, గడప దాటడం వల్లే ఇది సాధ్యమైందని చమర్తి పేర్కొన్నారు. ఇప్పుడు స్వేచ్ఛగా గడప దాటేందుకు శక్తి ఆప్ ఉందని గుర్తు చేశారు చదువుకునే పిల్లలు కూడా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని జగన్ మోహన్ రాజు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ నాగార్జున,కడప దిశా ఇన్స్పెక్టర్ యల్లం రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ కి ఎన్ని సుబ్బ నరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు,రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,పట్టణ ఎస్సై వెంకటేశ్వర్లు,మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మందా శ్రీనివాసులు,దిశా పోలీస్ సిబ్బంది, మహిళలు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పుష్పగిరి క్షేత్రంలో హరిహరులకు

**శాస్త్రోక్తంగా అభిషేకాలు, త్రిశూల,చక్రస్నానాలు ....!**





కడప మహి న్యూస్ ఏప్రిల్ 23: వైయస్సార్ కడప జిల్లాలోని వల్లూరు మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన పంచనదీ క్షేత్రం, దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పుష్పగిరిలో గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. క్షేత్రంలోని శ్రీ వైద్యనాథ స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్లకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెన్నా నదిలో ఉదయం 10 గంటల నుంచి11 గంటల30 నిమిషాల వరకు శ్రీ వైద్యనాథ స్వామి వారికి త్రిశూల స్నానం, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి చక్ర స్నానం అత్యంత వైభవంగా జరిపారు. శ్రీ వైద్యనాథ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు రాజేష్ శర్మ, చెన్నకేశవ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ స్వామి, కళ్యాణ్ స్వామిల ఆధ్వర్యంలో ఈ క్రతువు వైభవంగా సాగింది. ఈ త్రిశూల, చక్ర స్నానాల ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తమ మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసులు, పురావస్తు శాఖ ఉద్యోగి చంద్రకుమార్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# భగీరథ జయంతి వేడుకల్లో సగర హక్కుల గళం

**సగర కులస్తులకు న్యాయం ఎప్పుడు? రాజకీయ ప్రాధాన్యత కోరిన జనార్ధన్**



పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఏప్రిల్ 23: తొండూరు మండలం బూచుపల్లి గ్రామంలోని బీసీ కాలనీ రామాలయంలో సగర కుల గురువు శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ, సగర (ఉప్పర) కులస్తులకు రాష్ట్రంలో తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని సగర యువసేన రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జనార్ధన్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షలకుపైగా సగర కులస్తులు ఉన్నప్పటికీ రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2014లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సగర కులస్తులకు అనేక హామీలు ఇచ్చారని, అయితే అవి అమలు కాలేదని విమర్శించారు. బీసీ-డీ నుంచి బీసీ-ఏగా వర్గీకరణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి వంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. అలాగే 2024 ఎన్నికల సమయంలో కూడా కూటమి పేరుతో సగర కులస్తులను మభ్యపెట్టారని, ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించారని పేర్కొన్నారు. భగీరథ మహర్షి స్ఫూర్తితో సగర హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, చెన్నకేశవులు, మహేష్, విష్ణువర్ధన్, మహిళలు సరోజ, పార్వతి, భవాని తదితరులు పాల్గొన్నారు. పీవిఎల్ జయంతి వేడుకలను జరుపుతున్న సగర కులస్థులు

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఏప్రిల్ 23: వేసవి సెలవులను ఆనందంగా గడపాలని ఉత్సాహంగా ఇంటికి బయలుదేరిన ఓ బాలుడి జీవితం ఒక్క క్షణంలోనే చిద్రమైంది. తొండూరు సర్కిల్ వద్ద గురువారం చోటుచేసుకున్న ఈ రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వేంపల్లికి చెందిన గంగాదేవి కుమారుడు గురు ప్రణీత్ కుమార్ (13) తొండూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. సెలవులు ప్రారంభమవడంతో ఇంటికి వెళ్లేందుకు ఉదయం తన అన్న గురు యోగేంద్ర, స్నేహితుడు లోహిత్‌తో కలిసి ఆటోలో ప్రయాణం ప్రారంభించాడు. మధ్యలో దాహం వేయడంతో ఆటోను ఆపించి సమీప దుకాణంలో నీళ్ల బాటిల్ తీసుకున్నాడు. అనంతరం తిరిగి ఆటో ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా లారీ కింద పడ్డాడు . ఈ ప్రమాదంలో ప్రణీత్ తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. అక్కడున్న వారు వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రణీత్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎప్పుడూ చురుకుగా ఉండే ప్రణీత్ ఆకస్మిక మరణం గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దుర్ఘటన మరోసారి రోడ్డు భద్రతపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

# జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ

**అభివృద్ధికి ప్రజల అభిప్రాయాల స్వీకరణ**

**పంచాయతీ అభివృద్ధి అధికారి ఏ. నాగభూషణం రెడ్డి**



పులివెందుల /వేంపల్లె మహి న్యూస్ ఏప్రిల్ 23: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేంపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ అభివృద్ధి అధికారి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి తెలిపారు. ఈ గ్రామసభ నేడు శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగనుందని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ముఖ్య అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యలపై ప్రజల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన అన్ని వర్గాల ప్రజలు హాజరై తమ సలహాలు ఇవ్వాలని కోరారు. అవసరమైన తీర్మానాలను గ్రామసభలోనే ఆమోదించనున్నట్లు నాగభూషణం రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో వడగాలులపై అవగాహన కార్యక్రమం




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 23: పట్టణంలోని నగరిగుట్ట లోని ఆది ఆంధ్ర క్రిస్టియన్ కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో వడగాలులు- తీసుకోవలసిన జాగ్రత్తలు పై శానిటేషన్ సెక్రటరీలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీ గౌస్ మాట్లాడు తూ పిల్లలు నీడలో మాత్రమే ఆడుకోవాలి అని, వదులుగా ఉండే దుస్తులను ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఎండలో బయటికి వెళ్ళకూడదనీ,వెళ్లేటప్పుడు గొడుగు , టోపీ వంటివి తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పాఠశాల హెడ్మాస్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు ఈ ఎండాకాలం లో మంచి నీరు ఎక్కువగా తాగాలి అనీ మజ్జిగ, దోసకాయ, పుచ్చకాయ వంటి పదార్థాలలో తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం డేవిడ్ శ్యాంబాబు మాట్లాడుతూ ఎండలో తిరగడం వలన ఒంటిలో ఉన్న నీరు బయటకు ఎక్కువ పోయి డి హైడ్రేషన్ తో కండ్లు తిరిగే అవకాశం ఉంటుందని ఎక్కువ తలనొప్పి, కళ్ళు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ను సంప్రదించాలని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు లు సురేఖ, లక్ష్మీ నరసమ్మ,కమలాదేవి,రాజమ్మ శానిటేషన్ సెక్రటరీలు నరసింహారెడ్డి, డేవిడ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మన్నూరు గంగమ్మను దర్శించుకున్న తెదేపా నియోజకవర్గ

**ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**





రాజంపేట. మహిన్యూస్. ఏప్రిల్:23 : రాజంపేట పట్టణం పార్టీ నియోజకవర్గ కార్యాలయం రాజంపేట. రాజంపేట పట్టణం,మన్నూరు గ్రామం నందు పర్యటిస్తూ వైభవంగా మొదలైన మన్నూరు గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు అనంతరం ఆలయ నిర్వహకులు అమ్మవారి తీర్థప్రసాదాలను చమర్తి జగన్ మోహన్ రాజు కి అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



**పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 23: అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి గురువారం ఆర్డిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చిన్నయ్య, సిడిపిఓ శ్రీలత, డిప్యూటీ డిఎంహెచ్వో ఖాజా మొహిద్దీన్ లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో 11 మంది వర్కర్స్, 1 అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి 18 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పులివెందుల 2, ఇప్పట్ల 1 సింహాద్రిపురం 1, హిమకుంట్ల 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం.**

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com